## నేడు పటాన్‌చెరుకి మాజీ మంత్రి హరీష్ రావు రాక

**ముత్తంగి ఓఆర్ఆర్ జంక్షన్ నుండి జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ**

**పటాన్‌చెరు, జూలై 11,ప్రభాతవార్త:** బీఆర్‌ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్, ఎస్ఐఆర్ లపై ఆదివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ శాసన సభ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరు కాబోతున్నారని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ముత్తంగి ఓఆర్ఆర్ జంక్షన్ నుండి జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయం 10:00 గంటల నుండి 12:30 గంటల వరకు అవగాహన సదస్సు జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## బిజెపి జిల్లా కార్యదర్శిగా ఎల్కంటి సురేష్

**గజ్వేల్ టౌన్, జూలై 11 (ప్రభాతవార్త):** బిజెపి సిద్ధాంతాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి సిద్దిపేట జిల్లాలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ఎల్కంటి సురేష్ అన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, మెదక్ ఎంపి రఘునందన్‌రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, రాష్ట్ర నాయకుడు పూదరి నందన్‌గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేస్తూ కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు కట్టుబడి పనిచేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రత్యామ్నాయ విధానాలను వివరించే కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# సర్‌ను నిర్లక్ష్యం చేస్తే ఓటు గల్లంతు

**మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**సిర్గాపూర్, జూలై 11, ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటర్ల సవరణ(ఎస్ఐఆర్)ను నిర్లక్ష్యం చేయవద్దని, ఎన్యూ మరేషన్ ఫారాలను ప్రతి ఒక్కరు నింపి బిఎల్ఓలకు అందచేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా స్పష్టం చేశారు. చౌటకూరు గ్రామశివారులో పుల్‌కల్, చౌటకూరు, అందోలు మండలాలకు చెందిన కాంగ్రెస్ బిఎల్ఏలతో శనివారం మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రత్యేకంగా సమావేశమై బిఎల్ఏలకు పలు సూచనలు చేశారు. కొన్ని సంవత్సరాలుగా ఓటు హక్కు ఉందని, ఓటు ను వినియోగించుకుంటూ వస్తున్నానని, ఎన్యూమ రేషన్ పత్రం నింపకుంటే ఓటు ఎలా పోతుందని నిర్లక్ష్యం వహించి ఎన్యూ మరేషన్ పత్రాన్ని నింపి బిఎల్ఓలకు అందచేయ కుంటే ఓటు హక్కు గల్లంతు కావడం తథ్యమని మంత్రి సూచించారు. గ్రామాల నుంచి జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి వారికి సమాచారం అందించాలని, ప్రతిఓటరు ఎన్యూమరేషన్‌పత్రాన్ని నింపి బిఎల్ఓలకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌కు ఒక్కో ఏజంట్‌ను కాంగ్రెస్ తరఫున నియమించడం జరిగిందని, ఏజంట్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ సామాన్య ప్రజలతో పాటు కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన వారి ఓట్లు మిస్‌కాకుండా చూడాలిల్సన అవసరం బిఎల్ఏలపై ఉందని గుర్తుచేశారు. సమావేశంలో పుల్‌కల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గారెడ్డి, నాయకులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, శేరి జగన్ మోహన్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, ఆత్మ కమిటి చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, పార్కల రాంరెడ్డి, నందికంటి శ్రీనివాస్, పట్లోళ్ల భూంరెడ్డి, మల్లారెడ్డి, గణేష్,శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, భానూరి లక్ష్మయ్య, రామాగౌడ్, వర్కల రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా





మాట్లాడుతున్న రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

## సర్‌లో యువత చురుకుగా పాల్గొనాలి

**రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల గద్దర్**

**రాయపోల్, జూలై 11 (ప్రభాతవార్త):** భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో యువత, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల గద్దర్ పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లి, రాయపోల్ గ్రామాల్లో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డితోకలిసి ఎస్ఐఆర్ సమగ్ర ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా కాంగ్రెస్ కార్యకర్తలు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎవరి హక్కులు కోల్పోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ జీవితాంతం రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ గొల్లపల్లి కనకయ్య, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, నాయకులు మద్దుల గాలిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె నూరి ప్రభాకర్‌రెడ్డి, పడాల రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పంచమి గణేష్, మండల అధ్యక్షుడు జాల దుర్గాప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు తప్పెటి సుధాకర్, సర్పంచులు రాజు, అశోక్‌రెడ్డి, నాయకులు కిష్టారెడ్డి, పాల రామాగౌడ్, కృష్ణాగౌడ్, గుంటి నర్సింలు,పుట్ట నర్సింలు, అనిల్‌గౌడ్, కొంగరి దయాకర్, మాజీ ఎంపిటిసి స్వామి, దుర్గాప్రసాద్, నర్సింగరావు, యూసుఫ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ భారీ బహిరంగ సభకు నారాయణఖేడ్ సిద్ధం

**మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి.

**నారాయణఖేడ్, జూలై 11 (ప్రభాతవార్త):** బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నారాయణఖేడ్‌లో నిర్వహించనున్న సర్, పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన సభకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. నారాయణఖేడ్‌లోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ భారీ బహిరంగ సభను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సభ విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లను భూపాల్‌రెడ్డి స్వయంగా పరిశీలించి, నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామస్థాయివరకు విజయవంతం చేపట్టడంతోపాటు సర్ కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సమావేశం జరగనుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సభ్యత్వ సమన్వయకర్త జైపాల్ రెడ్డి, పలువురు రాష్ట్ర నాయకులు, సీనియర్ పార్టీ ప్రముఖులు హాజరుకానున్నారు. అలాగే నియోజకవర్గంలోని బీఎల్ఏలు, సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జ్‌లు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్, యువత, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.

## మెపా జిల్లా అధ్యక్షుడిగా బోయిని శ్రీనివాస్ ముదిరాజ్

**పుల్‌కల్, జూలై 11, ప్రభాతవార్త:** మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెసల్స్ అసోసియేషన్ తెలంగాణ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా పుల్‌కల్ గ్రామానికి చెందిన బోయిని శ్రీనివాస్ ముదిరాజ్‌ను నియమిస్తూ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్‌ముదిరాజ్ శనివారం నియామకపత్రంను అందచేశారు. ఈ సందర్భంగా పులిదేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ జాతి బిడ్డల ఐక్యత, విద్యా, ఉద్యోగ సాధికారత కోసం మెపా నిరంతరం కృషి చేస్తోందన్నారు. సమాజ అభివృద్ధికి యువత ముందుకు వచ్చి మెపాలో చేరి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన బోయిని శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మెపా రాష్ట్ర నాయకత్వానికి, సంగారెడ్డి జిల్ల ముదిరాజ్ పెద్దలకు, నాయకులకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానని, జాతి అభివృద్ధికి తన వంతు సేవలందిస్తామన్నారు.

## ఉపాధ్యాయ సంఘాలకు షాక్..!

**సభ్యత్వాలను ముకుమ్మడిగా తిరస్కరించిన పాపన్నపేట ఉపాధ్యాయులు**

**పాపన్నపేట, జూలై 11, ప్రభాతవార్త :** ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ అమలువంటి కీలక సమస్యల పరిష్కారంలో ఉపాధ్యాయ సంఘాలు ఆశించినస్థాయిలో పోరాటం చేయడంలేదని ఆరోపిస్తూ పాపన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఇకపై పాఠశాలలో ఏ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వం తీసుకోమని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉపాధ్యాయుల వివరాల ప్రకారం, రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో పాటు పీఆర్సీ అమలు వంటి సమస్యలు సాధనలో సంఘాలు ఉద్యమాలు చేపట్టడంలో విఫలమయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంలో భాగంగా శనివారం ఒక ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు సభ్యత్వ నమోదు కోసం పాఠశాలకు రాగా, ఉపాధ్యాయులందరూ ఏకగ్రీవంగా సభ్యత్వం తీసుకోవడానికి నిరాకరించారు. ఈ సందర్భంగా తమ నిరసన ఏ ఒక్క సంఘాన్ని లక్ష్యంగా చేసుకునికాదని, ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగానేనని స్పష్టం చేశారు. ఇకపై తమ పాఠశాలకు సభ్యత్వాల కోసం ఏ ఉపాధ్యాయ సంఘం రావద్దని విజ్ఞప్తి చేసిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని, అందుకు సంఘాలు మరింత చిత్తశుద్ధితో పోరాటాలు నిర్వహించాలని కోరారు.

## యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవాలి

**జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్**

**సంగారెడ్డి బ్యూరో, జూలై 11, ప్రభాతవార్త :** రైతులకు యూరియా ఎరువుల సరఫరాను మరింత పారదర్శకంగా, సులభంగా అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన "యూరియా బుకింగ్ యాప్" ద్వారా రైతులు ముందస్తుగా యూరియాను బుక్‌చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 96,150 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లాలో అన్ని ఎరువుల విక్రయ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైనమేరకు యూరియా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు తమకు సమీపంలోని ఎరువుల దుకాణంలో యూరియాను ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. యాప్‌లో నమోదు చేసుకున్న రైతులు బుక్ చేసిన 15 రోజులలోపు సంబంధిత విక్రయ కేంద్రానికి వెళ్లి యూరియాను పొందవచ్చని తెలిపారు. జిల్లాలో అత్యధికంగా పటాన్‌చెరు మండలంలో 13,093 బస్తాలు, నారాయణఖేడ్ మండలంలో 13,068 బస్తాలు, రాయకోడ్ మండలంలో 11,028 బస్తాలు, గుమ్మడిదల మండలంలో 6,394 బస్తాలు, మునిపల్లి మండలంలో 5,383 బస్తాలు, జహీరాబాద్ మండలంలో 4,053 బస్తాలు, కొండాపూర్ మండలంలో 3,758 బస్తాలు, కోహీర్ మండలంలో 3,648 బస్తాలు, జోగిపేట మండలంలో 3,544 బస్తాలు, సదాశివపేట మండలంలో 3,271 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతా మండలాల్లో కలిపి 28,909 బస్తాలు నిల్వ ఉన్నాయని, మొత్తం జిల్లాలో 96,150 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. అదేవిధంగా, మార్క్‌ఫెడ్ గోదాముల్లో మరో 70,934 యూరియా బస్తాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరాన్ని బట్టి వెంటనే విక్రయ కేంద్రాలకు తరలించి రైతులకు అందజేస్తామని తెలిపారు. రైతులు యూరియా కొనుగోలు సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులను తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే అంగీకరించవద్దని, కొనుగోలు చేసిన ప్రతి బస్తాకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, నిర్ణీత ధర కంటే అధిక ధర వసూలు చేసినా లేదా ఇతర సమస్యలు ఎదురైనా వెంటనే

## బొబ్బిలిగామలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**సదాశివపేట జూలై 11 ప్రభాతవార్త :** మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు మంజూరు చేసిన ఎన్ఆర్ఈజీఎస్ రూ.10 లక్షల నిధులతో సదాశివపేట మండలం బొబ్బిలిగామ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సదాశివపేట మండల బీజేపీ అధ్యక్షుడు కర్ణం ఆదిత్య ఆధ్వర్యం వహించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఎంపీ రఘునందన్ రావు అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉక్కిస భరత్, గ్రామ సర్పంచ్ సవ్వ ఉమాదేవి, ఉప సర్పంచ్‌లు విజేందర్, కిరణ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వీఆర్వో శ్రీనివాస్, గ్రామ బూత్ అధ్యక్షులు ముకేష్, అనిల్, బీజేపీ మండల నాయకులు కల్పగూరి నాగరాజు, జగనాథ్‌రెడ్డి, ప్రశాంత్, మొగులయ్య, వేణు, సుభాష్, దుర్గరాజ్, సుభాన్, లక్ష్మణ్, ప్రసాద్, అనిల్, సత్యనారాయణ, శ్రీకృష్ణ, సాకేత్, బన్నీ, గ్రామ మాజీ సర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాంసం దుకాణం ఏర్పాటుపై ఇరువర్గాల ఘర్షణ

**పలువురికి గాయాలు.. 15 మందిపై కేసు నమోదు**

**జోగిపేట, జూలై 11, ప్రభాతవార్త:** గొడ్డు మాంసం షాపు ఏర్పాటు విషయంలో వారం రోజులుగా కొనసాగుతున్న వివాదం చివరకు ఇరు వర్గాల ఘర్షణకు దారితీసింది. ఏర్పాటు చేస్తామని ఒకరు, చేయొద్దని మరొకరు.. ఈ విషయంలో పెద్దల సమక్షంలో ఒప్పందం కుదరక తీవ్రస్థాయిలో ఘర్షణకు దిగటంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందులో పలువురికి గాయాలయ్యాయి. అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేటలో ప్రస్తుతంఉన్న గొడ్డుమాంసం అమ్మే దుకాణాలకు ఆదనంగా మరో దుకాణం ఏర్పాటు చేయడానికి అందోలుకు చెందిన వారు ప్రయత్నిస్తున్నారు. దీనికి జోగిపేటకు చెందిన వారు అడ్డు చెప్పారు. ఈ విషయమై వారం రోజులుగా వివాదం కొనసాగుతుంది. పెద్దమనుషుల సమక్షంలో చర్చలు జరిగినప్పటికీ అది పరిష్కారం కాలేదు. దీంతో అందోలుకు చెందిన కటికె ముస్లింలు జోగిపేటలో గొడ్డు మాంసం దుకాణం ఏర్పాటు చేయడానికి జోగిపేటకు వచ్చారు. దీంతో వారిని జోగిపేటకు చెందిన కటికె ముస్లింలు అడ్డుకొని దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ వాదనకు దిగారు. ఇక్కడ తమకు హక్కు ఉందని, తప్పకుండా దుకాణం పెడతామంటూ మొండికేయటంతో మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో అక్కడే కట్టెలు, కత్తులతో దాడికి పాల్పడ్డారు. దీంతో జోగిపేటకు చెందిన అబ్దుల్ కైసర్ తలకు తీవ్రగాయాలవటంతోపాటు మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. చికిత్సనిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. మళ్లీ అక్కడ ఇరువర్గాల వారు ఒకరికొకరు తారసపడటంతో మరోసారు ఆసుపత్రి ఆవరణలోనే తీవ్రంగా ఘర్షణకు దిగారు. దీంతో ఆసుపత్రిలో గంటన్నరపాటు తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కాగా ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అబ్దుల్ కైసర్‌కు జోగిపేట ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఇమ్రాన్, ఇస్మాయిల్‌ల ఫిర్యాదుమేరకు ఇరువర్గాలకు చెందిన 15 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ దుర్గయ్య తెలిపారు.

## వృద్ధురాలు అదృశ్యం

**గుమ్మడిదల, జూలై 11 ప్రభాతవార్త :** గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక వృద్ధురాలు కనబడకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై అరుణ్ కుమార్ కథనం ప్రకారం గుమ్మడిదల గ్రామానికి చెందిన పానగారి శాంతమ్మ(65) ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె కుమారుడు పానగారి రమేష్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన యెడల గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని వారు కోరారు.

## ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**మర్కుక్, జూలై 11 (ప్రభాతవార్త):** ఎస్ఐ ఎస్‌కె.యూనస్ హైమద్‌అలీని ఆత్మ కమిటీ చైర్మన్ కనకయ్యాగౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గుర్రాల నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు శనివారం కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సకినాల భాస్కర్, పత్తి నర్సింలుయాదవ్, ర్యాకం యాదగిరి, ఉపసర్పంచ్ రమేష్, నాయకులు నర్సింలు, వెంకటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్‌లో ఆరు హత్యలు ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యమే

**హోం మంత్రిగా, సిఎంగా రేవంత్‌రెడ్డి విఫలం... రాజీనామా చేయాలి.. బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు**

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రంగారెడ్డిజిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలు ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యమేనని...హోం మంత్రిగా, సిఎంగా రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని తక్షణమే రాజీనామా చేయాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మాజీ సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన హృదయ విదారక సంఘటన ప్రతి మధ్యతరగతి పేద కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆడపిల్లలున్న తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఫోక్సో కేసు నిందితుడు ముగ్గురు పసిపిల్లలతో సహా ఆరుగురిని కిరాతకంగా చంపేయడం రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల వైఫల్యానికి సజీవ సాక్ష్యమన్నారు. గతనెల 16న మైనర్ బాలికపై అత్యాచారం జరిగితే...నిందితుడుని అరెస్టు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని తెలిపారు. నెలరోజులపాటు అతడిని అరెస్ట్ చేయకుండా వదిలేయడంతో అతను కోర్టు నుంచి యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకుని ఆ కుటుంబాన్నే అంతం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో ఎసిపి, డిసిపి, కమిషనర్ స్థాయిలో సమీక్షచేసి కఠిన సెక్షన్లుపెట్టి ఉంటే ఆరు హత్యలు జరిగేవి కాదన్నారు. కళ్ల తెరువని ముగ్గురు పసి పిల్లలతో పాటు అత్యాచారానికి గురైన బాలికను, ఆమె చెల్లెల్ని, తల్లిని, నాయనమ్మను చంపేశాడని తెలిపారు. ఆ బాధిత కుటుంబంలో కేవలం ఒకే ఒక అమ్మాయి మిగిలిందని ఆ అమ్మాయికి మాటలు రావు, చెవులు వినబడవు, నడవలేని వికలాంగురాలన్నారు. ఆ అమ్మాయి బాగోగులు చూడాడనికి ఎవరూ లేరన్నారు. ఇంత ఘోరం జరిగిన రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. అత్యాచారం చేసి ఆరుగురిని చంపిన కరుడుగట్టిన నేరస్తుడిని పట్టుకోవడంలో నెలలతరబడి సమయం తీసుకుంటున్న పోలీసులు బాధిత కుటుంబాన్ని ఓదార్చాడానికి వెళ్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడానికి నిమిషాల్లో స్పందిస్తున్నారని తెలిపారు. ఓదార్పు కోసం వెళ్తున్న నాయకులను నేరస్తుల్లా చూస్తున్న ప్రభుత్వం.. నేరస్తులను మాత్రం వదిలేస్తుందన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా భ్రష్టుపట్టించారని తెలిపారు. నైతిక విలువలుఉంటే రాష్ట్రంలో శాంతిభద్రతలను గాలికి వదిలేసిన సిఎం వెంటనే రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో లా అండ్ ఆర్డర్ కుప్పకూలందని.. పోలీసుస్టేషన్లు కేవలం ల్యాండ్ సెటిల్ మెంట్లకు అడ్డాలుగా మార్చారని మండిపడ్డారు. షాబాద్ సంఘటనతో దేశంలో రాష్ట్రం పరువుపోతుందన్నారు.

కిరాతక ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబలో మిగిలిన వికలాంగ చిన్నారి పేరు మీద ప్రభుత్వం వెంటనే రూ. కోటి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అమ్మాయి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.



మాట్లాడుతున్న హరీష్‌రావు

## మంజీరా నదిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

**న్యాల్‌కల్, జులై 11, ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన మహిళ మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చాల్కి గ్రామ శివారులోని మంజీర నదిలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం... మండల పరిధిలోని చాల్కి గ్రామానికి చెందిన ఫర్జానా బేగం(65) ఏడాది కాలంగా కార్డియాలజీ సమ్యతోపాటు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. శుక్రవాయం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గ్రామ శివారులోని మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. శనివారం మృతురాలి కుటుంబ సభ్యులు మహమ్మద్ షాజాహోద్దిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు.

## పాము కాటుతో రైతు సాయిలు మృతి

**సిర్గాపూర్, జూలై 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కడ్పల్ గ్రామానికి చెందిన రైతు సేనంగిల సాయిలు(45) పాము కాటుకు గురై శనివారం రాత్రికి మృతి చెందాడు. శుక్రవారం రాత్రి పొలానికి వెళ్లిన సాయిలు శనివారం ఉదయం పాలు తీసుకుని ఇంటికి రాకపోవడంతో కుటుం సభ్యులు వెళ్లి చూడగా మంచంపై అపార్మక స్థితిలో పడిఉన్నాడు. అతడిని వెంటనే సిర్గాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్‌లు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## చికిత్స పొందుతు మహిళా మృతి

**నర్సాపూర్, జూలై 11, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి కథనం ప్రకారం... శివంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన బొల్లు అంజయ్య(54) బొల్లు గౌరమ(45) టీవీఎస్ మోపెడ్‌పై నర్సాపూర్ వెళుతున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్ శివారులోకి వెల్దుర్తి ఎక్స్ రోడ్ వద్దకు రాగానే టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పి నర్సాపూర్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని నర్సాపూర్ పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్ కారులో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో హైదరాబాద్‌లోని నారాయణ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం వారిని తరలించారు. అయితే అక్కడి డాక్టర్లు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారని సూచించగా ఇద్దరినీ గాంధీ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం భార్య బొల్లు గౌరమ్మ(45) మృతి చెందిందని తెలిపారు. భర్త బొల్లు అంజయ్య చికిత్స పొందుతున్నారు. మృతురాలు కుమారుడు బొల్లు బాల్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు.

## గంజాయి విక్రేతల అరెస్ట్

**-80 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్‌ల స్వాధీనం**



అదుపులోకి తీసుకున్న నిందితుల వివరాలు తెలుపుతున్న ఏసిపి నర్సింలు

**జగదేవ్‌పూర్, జూలై 11 (ప్రభాతవార్త):** గంజాయిని ఇద్దరు యువకులు తీసుకువచ్చి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేసిన సంఘటన జగదేవ్‌పూర్‌లో శనివారం చోటుచేసుకుంది. గజ్వేల్ ఏసిపి నర్సింలు కథనం ప్రకారం జగదేవ్‌పూర్‌కు చెందిన చింతకింది అజయ్‌కుమార్, పీర్లపల్లి గ్రామానికి చెందిన బ్రెంకల శశిధర్ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తి వద్ద గంజాయి ప్యాకెట్లను కొనుగోలుచేసి, వాటిని జగదేవ్‌పూర్, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో ఒక్కో ప్యాకెట్ రూ.500 చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా శనివారం గజ్వేల్‌కుచెందిన చక్రి జగదేవ్‌పూర్‌లోని సబ్‌స్టేషన్ సమీపంలో గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని చింతకింది అజయ్‌కుమార్, బ్రెంకల శశిధర్‌లను అదుపులోకి తీసుకోగా జగదేవ్‌పూర్‌కు చెందిన రాయవరం రాజు, గజ్వేల్‌కు చెందిన చక్రి పరారైనట్లు తెలిపారు. నిందితుల నుండి 80 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్‌లు, ఒక హోండా ఆక్టివా, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను గజ్వేల్ న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందుతుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఏసిపి నర్సింలు పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్.. మూడు బైక్‌లు స్వాధీనం

**గజ్వేల్ టౌన్, జూలై 11 (ప్రభాతవార్త):** ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న నిందితున్ని శనివారం గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్ ఏసిపి నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని హనుమాన్ టెంపుల్ కాలనీకి చెందిన సంపంగి రాజేష్(29) అనే యువకుడు గజ్వేల్, శామీర్‌పేటల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడగా, శనివారం గజ్వేల్‌లోని ఇందిరాపార్కు చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన దొంగతనాల గురించి తెలుపగా, దొంగతనానికి పాల్పడిన మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితున్ని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించడం జరిగిందని తెలిపారు. నిందితున్ని పట్టుకోవడానికి కృషిచేసిన గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, క్రైమ్ సిబ్బందిని ఏసిపి అభినందించారు.

## అన్నారంలో అగ్నిప్రమాదం.. లక్షల్లో ఆస్తి నష్టం

**ఒరిజినల్ సర్టిఫికెట్లు, బంగారం, నగదు దగ్ధం**

**గుమ్మడిదల, జూలై 11 (ప్రభాతవార్త):** మండలంలోని అన్నారం గ్రామం ప్రకృతి నివాస్ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఓ కుటుంబానికి చెందిన విలువైన ఆస్తులు, ఒరిజినల్ విద్యా ధ్రువపత్రాలు, బంగారు ఆభరణాలు, నగదు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 10 రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇంటి మొదటి అంతస్తులోని బెడ్‌రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పొరుగింటి వ్యక్తి శ్యాంప్రసాద్ మంటలను గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు బయటకు వచ్చి స్థానికులతో కలిసి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. జీడిమెట్ల, దుండిగల్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో బంగారు గొలుసు, ఉంగరాలు, చెవిపోగులు, నగదు, ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, బీటెక్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు, ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డులు, బ్యాంకు పాస్‌బుక్స్, ఆర్సీ బుక్‌తో పాటు ఇతర ముఖ్యమైన పత్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



కాలిపోయిన సామాగ్రి దృశ్యం

## తాగునీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్ జూలై 11 ప్రభాతవార్త**

మహానగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులోని లింగంపల్లి -బంజారాహిల్స్ వరకు ఉన్న 1000 ఎంఎం దయా మెయిన్ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఈ భారీ లీకేజీలను అరికట్టడానికి అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టారు. దీనికి కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయి. ప్రస్తుతం యుద్ధప్రాతిపాదికన మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి కాగానే యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుంది. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మరమ్మతుల పనులపై తాజా పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ట్రాన్స్‌మిషన్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఎండీ అధికారులను ఆదేశించారు. కాగా, అంతరాయం ఏర్పడే ప్రాంతాలలో ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, వెంగళరావునగర్, ఎల్లారెడ్డిగూడ, సనత్‌నగర్, నిమ్స్, బంజారాహిల్స్, వెంకటగిరి, బీఎస్ మక్తా, ఎంఎస్ మక్తా, సోమాజిగూడ తదితరప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

## ప్రతిభా దర్శన్‌లో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన



ప్రతిభాదర్శన్‌లో విద్యార్థుల ప్రదర్శన

**జూబ్లీహిల్స్, జూలై 11, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్)లో 'హీరోస్ ఆఫ్ హిస్టరీ-లెజెండ్స్ హూ షేప్డ్ ది వరల్డ్'(చరిత్రను మలచిన మహనీయులు-ప్రపంచాన్ని తీర్చిదిద్దిన దిగ్గజాలు' పేరుతో ఏర్పాటుచేసిన ప్రతిభాదర్శన్ కార్యక్రమంలో నాల్గో తరగతి విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రపంచాన్ని మార్చిన ప్రసిద్ధ వ్యక్తుల గురించి అవగాహన కల్పించడమే కాకుండా వారి నిస్వార్థ సేవలు, వారి ధైర్యాన్ని విద్యార్థులకు పలు సంస్కృతిక ప్రదర్శనల రూపంలో విద్యార్థులు తమదైన ప్రతిభతో చాటిచెప్పారు. ప్రైమరీ హెడ్‌మిస్ట్రెస్ విధు మోహన్ మాట్లాడుతూ చరిత్రను మలచిన మహనీయుల ఆలోచనలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రిన్సిపల్ కాంచనవల్లి మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉండే ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మురళీముకుంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ ను, ప్రతిభను ప్రోత్సహించడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

## విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి : ఇన్‌స్పెక్టర్ సైదులు



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ సైదులు.

**బేగంపేట జూలై 11,ప్రభాతవార్త**

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ,సేవాభావం,నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు విద్యార్థులకు పిలుపు నిచ్చారు.బేగంపేట సైబర్ మన్సూరా స్కూల్ ఇన్వెస్టిచర్ (విద్యార్థి ప్రతినిధుల ప్రమాణ స్వీకార) సెర్మనీలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్స్‌పెక్టర్ సైదులు వారికి బ్యాడ్జీలను బహుకరించారు.ఆయన మాట్లాడుతూ నిజమైన నాయకత్వం అంటే కేవలం అధికారం కాదని,తోటి విద్యార్థుల పట్ల జవాబు దారితనం,నిబద్ధత,సేవానిరతి కలిగి ఉండటమేనని వివరించారు. సైబర్ నేరాలు,మోసాల పట్ల విద్యార్థులు వారి తల్లి దండ్రులను అప్రమత్తం చేయాలని సూచించారు.మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్ పాఠశాల నిర్వాహకులు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లు భాగస్వాములు కావాలి



ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న నర్సింలు, తదితరులు

**శేరిలింగంపల్లి,జూలై 11 ప్రభాతవార్త**

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లు భాగస్వాములు కావాలని, ప్రతి ఓటరు తమ పేర్లను సరిచూసుకోవాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి నియోజక వర్గ బీజేపీ నేత టేకు నర్సింలు అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గ బీజేపీ నేత మారబోయిన రవికుమార్, శేరిలింగంపల్లి డివిజన్ నేత ఎల్లేశ్ ఆదేశాల మేరకు పాపిరెడ్డినగర్‌కాలనీ, ఆరంభ టౌన్‌షిప్‌లోని పోలింగ్ బూత్‌లు 181,182, 170,172నుంచి 176 వరకు బూత్‌లలో స్థానిక బీఎల్ఓలతో కలిసి సీనియర్ బీజేపీ నేత టేకు నర్సింలు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత నర్సింలు మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును కలిగిఉండేందుకు ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించాలన్నారు. కాలనీలకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించి ప్రతి ఒక్క ఓటును నిలుపుకునేందుకు ఆధారాలను అందజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు బాలు,సుబ్బు, పిన్నీ,అజయ్ కుమార్,విజయలక్ష్మీ,ఎంఎస్ రావు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య

### అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్,జూలై 11,ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య ముఖ్యం అని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గోల్నాక లంక ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల 6వ, 7వ తరగతి విద్యార్థులకు గత కొన్ని నెలలుగా ప్రత్యేక ట్యూషన్ తరగతులను స్వంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులతో కలిసి మాట్లాడారు. విద్యార్థులు చదువులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ఉచిత ట్యూషన్‌తో పాటు ప్రతిరోజూ టిఫిన్ సౌకర్యం, ట్యూషన్ ఫీజు మొత్తాన్ని తానే భరిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

## నిమ్స్‌కు మిసోనిక్స్ నెక్సస్ బోన్ స్కాల్పెల్ సిస్టంను అందించిన రోటరీ క్లబ్



ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్, బీహెచ్ఈఎల్-జీఈ గ్యాస్ ప్రతినిధులు, నిమ్స్ డైరెక్టర్ తదితరులు

**జూబ్లీహిల్స్, జూలై 11, (ప్రభాతవార్త):**

ఎంతో క్లిష్టమైన మెదడు, వెన్నుముక శస్త్రచికిత్సలను మరింత ఖచ్చితత్వంతో, అత్యంత భద్రతతో నిర్వహించేందుకు దాదాపు కోటి రూపాయల విలువైన అత్యాధునిక మిసోనిక్స్ నెక్సస్ బోన్ స్కాల్పెల్ సిస్టంను దాతలు నిమ్స్ ఆసుపత్రికి అందించాయి. రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సనాతన్ సర్వీస్ ట్రస్ట్, బీహెచ్ఈఎల్-జీఈ గ్యాస్ టర్బైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఆధ్వర్యంలో ఈ యంత్రాన్ని నిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రామలింగేశ్వరరావుకు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ శస్త్రచికిత్సలు ఖచ్చితత్వంతో వేయడంతోపాటు చికిత్సల సమయంలో మృదుకణజాలానికి కలిగే నష్టం తగ్గడంతో పాటు, రోగులు వేగంగా కోలుకునేందుకు, మెరుగైన వైద్య ఫలితాలు సాధించేందుకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ విలువైన పరికరాన్ని అందించిన సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ జి.కె. పరంజ్యోతి, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై. వంశీకృష్ణ, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఇంటర్నేషనల్ 3150వ గవర్నర్(2025-26) రోటేరియన్ డాక్టర్ ఎస్.వి. రాంప్రసాద్, బీహెచ్ఈఎల్-జీఈ గ్యాస్ టర్బైన్ సర్వీసెస్ జాయింట్ ఎండీ చంద్రశేఖర్ యూరపాక, రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సనాతన్ అధ్యక్షుడు రోటేరియన్ రంజయ్ గోయల్, క్లబ్ కార్యదర్శి, ట్రస్ట్ ఛైర్మన్ రోటేరియన్ రాజేహన్స్ బాంకా, క్లబ్ ట్రెజరర్ రోటేరియన్ సంజయ్ కబ్రా, ట్రస్ట్ కార్యదర్శి, సీఎస్ఆర్ డైరెక్టర్ రోటేరియన్ శ్రీనివాస్ గుడిమెల్లి, ట్రస్ట్ కోశాధికారి రోటేరియన్ రవి లాడియాలతోపాటు పలువురు అధ్యాపకులు, వైద్యులు, రెసిడెంట్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల కమ్యూనిటీ హాల్‌పై అధికారుల పెత్తనం సహించం : మాజీ కార్పొరేటర్

### -జోనల్ కమిషనర్‌తో వాగ్వాదం



టి.ఆర్.టి కమ్యూనిటీ హాల్ వద్ద మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, కాంగ్రెస్ నేతలు మారిశెట్టి నర్సింగ రావు, బింగి సాయికీర్తి తదితరులు

**చిక్కడపల్లి జూలై 11 (ప్రభాతవార్త ) :** ప్రజల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను అధికారులు తమ సొంత అవసరాలకు వాడుకోవడాన్ని ఎంతమాత్రం సహించబోమని గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ హెచ్చరించారు. గాంధీనగర్ డివిజన్ పరిధిలోని టి.ఆర్.టి కమ్యూనిటీ హాల్‌ను ప్రభుత్వ శాఖ పనులకు కేటాయించడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనకు బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు మద్దతుగా నిలిచారు. మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికులకు, పేద ప్రజలకు చిన్న చిన్న శుభకార్యాలు చేసుకోవడానికి ఉపయోగపడే ఈ కమ్యూనిటీ హాల్‌లోకి ప్రజలను అనుమతించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజల ఆస్తిని అధికారులు తమ అధీనంలోకి తీసుకోవడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ ( బాబ్జి), సీనియర్ బీజేపీ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, సత్తి రెడ్డి, ఆనంద్ రావు, సాయి కుమార్‌తో పాటు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**జోనల్ కమిషనర్‌తో వాగ్వాదం..**

ధర్నా సందర్భంగా ఆమె జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ మంగతాయారుతో ఫోన్ ద్వారా మాట్లాడారు. హాల్‌ను ప్రభుత్వ అవసరాలకు కేటాయించడంపై నిలదీశారు. అయితే, ఈ అనుమతులు తమ పరిధిలో లేవని, కమిషనర్ గారి అధీనంలో ఉన్నాయని జోనల్ కమిషనర్ సమాధానం ఇవ్వడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం సోమవారం డివిజన్‌లోని అన్ని పార్టీల నాయకులతో కలిసి జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని పావని వినయ్ కుమార్ స్పష్టం చేశారు.

## చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తక్షణమే కల్పించాలి



**అత్తాపూర్ జూలై10 ,ప్రభాతవార్త :** దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభలలో కనీసం 33 శాతం రిజర్వేషన్ తక్షణమే కల్పించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. శనివారం అరుణ, నీలమ్మ అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐ డబ్బులు 5వ మహాసభ సిపిఐ రాజేంద్రనగర్ కార్యాలయం ఏ ఆర్ దేవరాజ్ భవన్‌లో జరిగింది.ముఖ్యఅతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి వందన్ అభియాన్ పేరుతో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పటికీ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో 2029 సంవత్సరానికి వాయిదా వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ తక్షణమే అమలు చేయాలని మోడీ సంకీర్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్త్రీలపై జరుగుతున్న అన్ని రకాల దోపిడీ వివక్షత పీడనలకు కారణం ఫాసిస్టు సామ్రాజ్యవాద పితృస్వామ్య వ్యవస్థ కారణమని తెలిపారు ఆధిపత్య దోపిడీ పాలకవర్గాలను కూల్చడంతోనే మహిళల యొక్క విముక్తి ముడిపడి ఉందని పేర్కొన్నారు. ఆధునిక సమాజంలో కూడా స్త్రీలపై అత్యాచారాలు అపహరణలు వరకట్న వేధింపులు హత్యలు నిత్య కృత్యమైనాయని ఆవేదన వెలిపించారు సాంఘిక ఆర్థిక రాజకీయ సమానత్వం సమాజంలో మహిళలకు అందినప్పుడే మహిళా సాధికారిక సాధ్యం అవుతుందని తెలిపారు బలమైన మహిళా సమాఖ్య నిర్మాణం కొరకు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహిస్తూ జిల్లా మహాసభలను పూర్తి చేసుకుంటూ రాష్ట్ర మహాసభకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభ లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఫైమీద, లక్ష్మి, అనురాధ, విజయ కమల, మంజుల శ్రీదేవి సుజాత యాదమ్మ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు, నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది ,గౌరవ అధ్యక్షురాలిగా నీలమ్మ,అధ్యక్షురాలిగా వడ్ల మంజుల,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కన్యగారి లక్ష్మి ఉపాధ్యక్షురాలిగా యాదమ్మ, వరలక్ష్మి,ప్రధాన కార్యదర్శిగా శ్రీదేవిసహాయ కార్యదర్శులుగా రోజా, సుజాత కోశాధికారిగా అలివేలును ఎన్నుకోన్నారు.

## పాతబస్తీలో ఆగష్టు 16న భవ్య కావడి యాత్ర



సమావేశంలో పాల్గొన్న భాగ్యనగర్ కావడి సేవా సంఘం ప్రతినిధులు

**చార్మినార్,జూలై 11 ప్రభాతవార్త :**

భాగ్యనగర్ కావడి సేవా సంఘం ఆధ్వర్యంలో అగష్టు నెల 16వ తేదీన అత్యంత వైభవంగా 29వ భవ్య కావడి యాత్రను నిర్వహించనున్నమని సంఘం ప్రతినిధులు తెలిపారు. చార్మినార్ శ్రీ మహదేవ మందిరం నుంచి ఆగష్టు నెల 16వ తేదీ ఆదివారం 6.31 గంటలకు భవ్య కావడి యాత్రం ప్రారంభమై పలు మార్గాలు మీదుగా కొనసాగిన అనంతరం 17వ తేదీ సోమవారం రోజున సరూర్ నగర్‌లోని శ్రీ ఉమా మహేశ్వరి స్వామి వారి దేవస్థానికి చేరుకుంటుందని,బ్రహ్మ ముహూర్తంలో భగవాన్ శివునికి ప్రయాగ్ నుంచి తెచ్చిన గంగా జలంతో అభిషేకం జరుగుతుందని వారు తెలియజేశారు.ఈ సమావేశంలో భాగ్యనగర్ కావడి సేవా సంఘం అధ్యక్షులు మాంగేరాం తాయల్,కోశాధికారి చంపాలాల్, ప్రతినిధులు సురేంద్ర అగర్వాల్,సునీల్ కుమార్ అగర్వాల్, కమల్ కిశోర్ మాలాణి,లలిత కకేడ్,రుబీ మిశ్ర,మీనా గుప్త, విజయ్ కుమార్,అగర్వాల్,ఫంకజ్ వర్మ,ఓం ప్రకాష్ అగర్వాల్, మనీష్ కింకాన్,అభినవ్ అగర్వాల్,భరత్ అగర్వాల్,కుణాల్ గోయల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### భరతోదయం మహా పద్యకావ్య ఆవిష్కరణ

**చిక్కడపల్లి జూలై 11 (ప్రభాతవార్త ) :** నవ్య సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ ఔషధ శాస్త్ర ఆచార్యులు డా. దేవరాజు రాంభావు రచించిన 770 పేజీల బృహత్ పద్యకావ్యం "భరతోదయం" ఆవిష్కరణ మహోత్సవం ఆదివారం నిర్వహించబోతున్నట్లు సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షులు వేమరాజు విజయ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చిక్కడపల్లి లో విలేకరులతో మాట్లాడుతూ మహాకవి వానమామలై వరదాచార్య కలిగించిన ప్రేరణతో ఆచార్య రాంభావు ఈ రసవత్తర కావ్యాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రచించారు. డా. రాంభావు అశీతి (80వ) జన్మదినం సందర్భంగా నవ్య సాహితీ సమితి ఆధ్వర్యంలో ఈ మహా కావ్యావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని డా. ఆచార్య ఫణీంద్ర పేర్కొన్నారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగ మంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ శాఖామాత్యులు శ్రీ డి. శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని విష్కరించనున్నారు.ప్రముఖ సాహితీవేత్త ఆచార్య అనుమాండ్ల భూమయ్యలు వస్తున్నట్లు కార్యనిర్వాహక అధ్యక్షులు వేమరాజు విజయకుమార్ వివరించారు.

## కొడవలితో భార్యను హత్య చేసేందుకు ప్రయత్నం

### -కుటుంబ కలహాలు నేపథ్యంలో ఘటన

### -అల్వాల్‌లో కలకలం

**అల్వాల్, జూలై 11 ప్రభాతవార్త:**

కుటుంబ కలహాలు నేపథ్యంలలో భార్యతో పాటుగా ఆమె సోదరుడిని హతం చేసేందుకు కత్తితో దూసుకు వెళ్ళిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అల్వాల్‌లో కలకలం రేపిన ఘటనకు సంబంధించి పోలీసులు బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హస్మత్‌పేట్‌కు చెందిన చందు, సంజనల వివాహం సంవత్సరం క్రితం జరిగింది. ఆరు నెలలు నుంచి ఇరువురికి పొసగటం లేదు. తరుచు భార్య భర్తలు మధ్య కీచులాటలు జరుగుతున్నాయి. భర్త వేదింపులు తాళలేని సంజన పుట్టింటికి వెళ్ళి పోయింది. అప్పటి నుంచి చందు భార్యతో పాటుగా ఆమె కుటుంబ సభ్యులుపై కక్ష పెట్టుకున్నాడు. భార్య సంజన గ్రీన్‌ఫీల్డ్స్‌లోని బాబాయ్ ఇంటి వద్ద ఉందనే సమాచారం శనివారం చందుకు తెలిసింది. క్షణికావేశంలో అతను కొడవలిని తీసుకుని భార్య ఉన్న ఇంటి వద్దకు చేరుకున్నాడు. భార్యపై కొడవలిపై దాడి చేయడానికి ప్రయత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకుని ఇంటి నుంచి బయటకి పంపించి వేశారు. సంజనను ఎప్పటికైనా చంపుతానని బెదిరించి అక్కడి నుంచి చందు వెళ్ళి పోయాడు. సంజనతో పాటుగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు ఫిర్యాదుదారులకు అందజేత

**చార్మినార్,జూలై 11 ప్రభాతవార్త :**

పాతబస్తీ చార్మినార్ డివిజన్ పరిధిలోని చార్మినార్ పోలీస్ సిబ్బంది సాంకేతిక దర్యాప్తు కేంద్ర ప్రభుత్వ సిఈఐఆర్ పోర్టల్‌ను సమవర్ధంతంగా వినియోగించి పోగొట్టుకున్న 30 మొబైల్ సెల్‌ఫోన్లనురికవరీ చేశారు.చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసిపి చంద్రశేఖర్ ఫిర్యాదు దారులకు వారు పోగోట్టుకున్న 30 మొబైల్ సెల్ ఫోన్లను తిరిగి శనివారం అందజేశారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు,డిఐ నర్సింగ్ రాథోడ్,డిఎస్ఐ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

## బోనాల పాటలతో హోరెత్తిన రవీంద్రభారతి



గురువులను సత్కరిస్తున్న జెఎల్.శ్రీనివాస్, దైవజ్ఞశర్మ, లలితారావు, ఉదయభాస్కర్ తదితర గురువులు

**రవీంద్రభారతి, జూలై 11 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే బోనాల పండుగ ఎంతో సుప్రసిద్ధమైనదని, చిన్నారుల నుండి వయోధికుల వరకు మేళతాళాలతో, పోతరాజు విన్యాసాలతో ఆహ్లాద ఆనందకరంగా జరుపుకునే పండుగని ఏపి ఫిలిం డెవలప్‌మెంటు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, ప్రముఖ సినీ, టీవి నటుడు, పాత్రికేయుడు జె.ఎల్.శ్రీనివాస్ అన్నారు. వారాహి అమ్మవారి ఉత్సవాలు జరిగేముందు ఈ జాతర జరగడం శుభకరమన్నారు. చిన్నారుల నృత్యాలన్నీ ఆద్యంతం అద్భుతమని ప్రశంసించారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ముఖ్యంగా కూచిపూడి నృత్యకళకు, కళాకారులకు ఇస్తున్న, ప్రోత్సహిస్తూ చేస్తున్న సేవ అనితరసాధ్యమని, కూచిపూడి సామూహిక నృత్యప్రదర్శనలతో రెండుసార్లు గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను కైవసం చేసుకోవడం అందుకు నిదర్శమని, ఇలాంటి సంస్థలను ప్రభుత్వాలతోసహా అందరూ ప్రోత్సహిస్తూ అన్నివిషయాల్లో అండదండగా నిలవాలని సూచించారు. మన పండగలన్నీ దైవాన్ని ఆరాధిస్తూ చేసుకునే పండుగలేనని పసుపులేటి ఉదయభాస్కర్ అన్నారు. చిన్నారులను గొప్ప నృత్యకళాకారులుగా తీర్చిదిద్దుతున్న గురువులందరి కళాసేవను అభినందిస్తూ అమ్మవారి కృప అందరిపైనా ఉండాలని, దేశం సుభిక్షంగా సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ భారతీయ కళలను ప్రోత్సహిస్తూ సేవలందిస్తున్న లలితారావు భారతీయతను, సంప్రదాయాలను, జాతీయతను కాపాడుతున్నందుకు శుభాభీస్సులందజేశారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శనివారం ఉదయం సంస్థ అధ్యక్షురాలు లయన్ లలితారావు నేతృత్వంలో కన్నులపండువగా జరిగిన బోనాల జాతరకు ముఖ్యఅతిథిగా హాజరైన జె.ఎల్.శ్రీనివాస్ విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, పసుపులేని ఉదయభాస్కర్ తదితరులతో కలిసి పాల్గొని ఈనాటి తెలంగాణ బోనాల జాతరలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో స్తుతిస్తూ నృత్యప్రదర్శనలు కావించిన కళాకారులకు ప్రశంసాపత్రాలు, గురువులకు జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాకారులు అద్భుత నృత్యాలతో బోనాల జాతరను కళ్లకుకట్టి భక్తిభావాన్ని రేకెత్తించారు.

## కష్టపడిన చదువే ఉన్నతశిఖరాలను అధిరోహిస్తుంది : కె.వి.రమణాచారి



బహుమతి గ్రహీతలైన విద్యార్థులతో రమణాచారి సంధ్యారాణి, వల్లీశ్వర్, లక్ష్మీనారాయణ తదితర అతిథులు

**నాంపల్లి, జూలై 11 ప్రభాతవార్త :** జీవించినంతకాలం ఒక ఆశయం, లక్ష్యం సాధన కోసం బతకాలని, పేదరికం చదువుకు అడ్డంకాదని, దీన్ని అధిగమించేందుకు ధృఢనిశ్చయంతో ముందుకెళితే విద్యావంతులై అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి విద్యార్థులకు ఉద్బోధించారు. 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సంధ్యారాణి వారిలో స్ఫూర్తి, పట్టుదల, పంతాన్ని, విజయానికి ధృడనిశ్చయాన్ని సమకూర్చడం కోసం నగదు బహుమతితో ప్రోత్సహించడం శ్లాఘనీయమన్నారు. శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణ క్యాంపు కార్యాలయంలో యువకళావాహిన అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ప్రముఖ పాత్రికేయుడు వల్లీశ్వర్, విజయ్‌రవి, పి.సంధ్యారాణి తదితరులతో కలిసి ఏడు ప్రభుత్వ పాఠశాలల నుండి ఎంపిక చేసిన 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు పొందిన లక్ష్మి, సాయిప్రసాద్, యోగేష్, ప్రత్యూష, సంధ్య, పద్మశ్రీ, లోకేష్, కీర్తనలను సన్మానించి నోట్‌బుక్స్, వ్యక్తిత్వవికాస పుస్తకం, మెరిట్ సర్టిఫికెట్‌తోపాటు ఒక్కొక్కరికి వెయ్యిరూపాయల నగదు బహుమతిని అందజేసి శుభాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేణు గీతిక, కృష్ణ, శివాజీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## సమయానికి నీళ్లు ఇచ్చేలా చూడండి

**జూబ్లీహిల్స్, జూలై 11, ప్రభాతవార్తః**

ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వరకాలనీ డివిజన్ ప్రతాప్‌నగర్‌లో సమయపాలన లేకుండా నీటి సరఫరా చేస్తున్నారని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై సమరం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన ప్రతాప్ నగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి వేళ నీళ్లు వస్తున్నాయని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే వారం రోజులుగా వీధిదీపాలు వెలగక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన జలమండలి మేనేజర్ శివకుమార్‌తో, వీధిదీపాల అధికారులతో మాట్లాడారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 15న నిర్వహించే సభను విజయవంతం చేద్దాం

### ఆర్‌పీఐ(ఏ) జాతీయ కార్యదర్శి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి పేరం నాగేశ్వర్‌రావుగౌడ్



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పేరం నాగేశ్వర్‌రావుగౌడ్

**ముషీరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** ఈనెల 15వ తేదీ కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) జాతీయ అధ్యక్షులు రాందాస్ అథవాలే హైదరాబాద్‌కు విచ్చేయుచున్న సందర్భంగా నిర్వహిస్తున్న భారీ సభను విజయవంతం చేద్దామని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి పేరం నాగేశ్వర్‌రావుగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాందాస్ అథవాలే హైదరాబాద్ పర్యటన పార్టీకి, సామాజిక న్యాయ ఉద్యమానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, సభ్యత్వ విస్తరణ, రాష్ట్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు చర్చించారు. జులై 15న జరిగే సభకు విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్న ప్రసాద్, మేడి సతీష్, సచిన్‌గౌడ్, గోరక్‌సింగ్, జగన్నాథం, రాచమల్ల, పోతరాజు, సాంబ కాన్షిరాం,సుద్దాల అశోక్ పాల్గొన్నారు.

## వేర్వేరు ఘటనలో ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

**జూబ్లీహిల్స్, జూలై 11, ప్రభాతవార్తః**

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన ఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా నుంచి నగరానికి మెడికల్ కోడింగ్ కోసం వచ్చిన ఒక యువతి(23) అమీర్‌పేట ప్రాంతంలో హాస్టల్‌లో చేరింది. ఉద్యోగంలో చేరుతున్నానని, ఇంటికి రానని తన చెల్లికి తెలియజేసింది. అప్పటి నుంచి ఆమె ఫోన్ అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో సంఘటనలో సోమాజీగూడ ప్రాంతానికి చెందిన ఇంటర్ విద్యార్థిని(17) మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. అలా వెళ్లిన ఆమె తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మర్ధన కోసం చూస్తే రూ. 53వేలు కాజేశారు

**జూబ్లీహిల్స్, జూలై 11, ప్రభాతవార్తః**

స్పా సేవల కోసం చూసిన ఒక వ్యక్తిని సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించి రూ. 53వేలు కాజేసిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన మల్లికార్జున్ ఇన్‌స్టాలో వచ్చిన ఒక ప్రకటన చూసి టెలిగ్రామ్ యాప్ ద్వారా స్పా సేవల కోసం సంప్రదించాడు. భద్రతా డిపాజిట్ పేరుతో సైబర్ మోసగాళ్లు అతని వద్ద నుంచి రూ. 53,500లు కాజేశారు. మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

**గన్‌ఫౌండ్రి,జూలై 11ప్రభాతవార్త:**

ఇంటి నుండి కారును బయటకు తీస్తుండగా ఎదురు ఇంటిలో ఉన్న వ్యక్తితో తలెత్తిన గొడవ దాడికి దారి తీసిన ఘటన శుక్రవారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో జరిగింది.ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం ప్రకారం.. అబిడ్స్ చిరాగ్‌అలీలైన్ బస్తీకి చెందిన కె.సాయిఅక్షిత్‌రెడ్డి,తన తాత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని,అతని డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకు వచ్చేందుకు ఇంట్లో ఉన్న కారును బయటకు తీస్తుండగా ఎదురుగా ఉండే నేతాజీనగర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ అహ్మద్ ముల్దీ(19)అలియాస్ నేహల్,అతని తల్లి యాస్మిన్ నెహాల్ ముల్దీ కారుకుఅడ్డుగా వచ్చి సాయి అక్షిత్‌రెడ్డిపై దాడికి యత్నించారు. అంతటిత అగకుండా అసభ్య పదజాలంతోదూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే సాయి అక్షిత్‌రెడ్డి 100 డయల్‌కు ఫోన్ చేసిపోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించారు.వెంటనే అక్కడికి వచ్చిన అబిడ్స్ పోలీసులు వచ్చి అబ్దుల్ అహ్మద్ ముల్దీ అలియాస్ నేహాల్‌ను అదుపులోకి తీసు కుని కోర్టులో హాజరు పర్చినట్లు పోలీసులుతెలిపారు.యాస్మిన్ నేహాల్ కూడా స్థానిక బస్తీలో పలువురితో గొడవలు దిగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని తన దృష్టికి వచ్చిందని ఇన్‌స్పెక్ట ర్ పరుశురాం ఆమెను పద్ధతి మార్చుకోమని అందరికితో కలసి మెలసి ఉండాలని,లేనిపక్షంలో జైలుకు పంపుతామని హెచ్చరించారు.

## అదృశ్యమైన యువకుడు

**అఫ్జల్‌గంజ్,జూలై 10ప్రభాతవార్త:** పని నిమిత్తం నగరానికి తల్లితో వచ్చిన కొడుకు అదృశ్యమైన సంఘటనఆలస్యంగా సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కథనం ప్రకారం...కృష్ణపూర్ గ్రామానికి చెందిన బెస్త మల్లయ్య,ఆయన భార్య మల్లవ్వ, కుమారుడుమధుతో కలిసి ఆర్‌టిసి బస్సులో ఈనెల 7వ తేదిన నగరానికి వచ్చారు.అక్కడి నుంచి బషీర్‌బాగ్‌లోనిబంధువుల ఇంటికి వెళ్లేందుకుగాను సిబిఎస్ బస్టాండ్ నుంచి విక్టరీ ప్లేగ్రౌండ్ ఎదురుగా వెళ్లినట్లు చెప్పారు.అక్కడే సాయిబాబా ఆలయంలో భోజనం చేశారు.తర్వాత బషీర్‌బాగ్ వైపు వస్తుండగా మధ్యలో కుమారుడైన మధు 10 రూపాయలు తీసుకుని సాగర్ కొనుగోలు చేసుకుంటానని వెళ్లినట్లు చెప్పారు.తల్లిదండ్రులు ఎంత వద్దు అని చెప్పినప్పటికి విన్నక డిఎంహెచ్ కోఠి రోడ్డు దాటడానికి ప్రయత్నించారు.అప్పటికే ట్రాఫిక్ సిగ్నల్ వేయడంతో వాహనాలు రాకపోకలు సాగించారు.క్షణాలలోనే తమ కుమారుడుమధు కనిపించలేదని తండ్రి బెస్త మలయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్‌బిఐ అసిస్టెంట్ మేనేజర్ అదృశ్యం...

**అఫ్జల్‌గంజ్,జూలై 11ప్రభాతవార్త:** ఇంటి నుంచి విధులకు బయలుదేరి వెళ్లిన ఓ బ్యాంకు అధికారికనిపించకుండా పోయిన సంఘటన సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులకథనం ప్రకారం.. మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా రాంపల్లి ఇస్మాల్ ఖాన్ గూడకు చెందిన వి.రామ నరసింహం అలియాస్ రవి(40) కోఠి బ్యాంకు స్ట్రీట్‌లోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్‌మేనేజర్‌గా విధులను నిర్వహిస్తున్నారు.ఈ నెల 8వ తేదిన ఇంటి బయలు దేరి వెళ్లిన భర్త రాలేదని దీంతో భార్య వేముగుంట సుధ సత్య కావేరి వాకబు చేశారు,బంధువులు,స్నేహితుల ఇళ్లకుఫోన్ చేసి వాకబు చేసినా ఫలితం లేక పోయింది.పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా అతని జాడ తెలియలేదు.దీంతో రామ నరసింహం భార్య గురువారం సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించి, విధినిర్వహణ నిమిత్తం ఇంటి నుంచి బయలు దేరిన తన భర్త ఇంటికి రాలేదని ఫిర్యాదు చేసింది.ఈ మేరకుసుల్తాన్‌బజార్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అబార్షన్ చేయించాడు.. పెళ్లంటే ముఖం చాటేశాడు

**జూబ్లీహిల్స్, జూలై 11, ప్రభాతవార్తః**

స్నేహం చేసి.. పెళ్లంటూ నమ్మించి, రెండు సార్లు రెండు సార్లు అబార్షన్ చేయించి చివరికి ముఖం చాటేసిన ఒకరిపై ఖైరతాబాద్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఒక యువతి(32) హైదరాబాద్‌లో నివసిస్తుంది. ఎస్సై, పోలీసు కానిస్టేబుళ్లకు సంబంధించిన ఒక ఆందోళనలో పాల్గొన్న ఆమెకు సూర్యాపేట జిల్లాకు చెందిన రూపావత్ శంకర్(31)తో పరిచయమైంది. దీంతో ఇద్దరి మధ్య స్నేహం అది కాస్త ప్రేమ, పెళ్లి వరకు వెళ్లింది. అతన్ని నమ్మి దగ్గరైన ఆమెకు శంకర్ వివిధ కారణాలు చెప్పి రెండు సార్లు అబార్షన్ చేయించాడు. మూడోసారి మిస్‌క్యారీ అయ్యింది. శంకర్ కుటుంబ సభ్యులు ముందుగా పెళ్లికి అంగీకరించినా ఇప్పుడు వారంతా ముఖం చాటేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు టీ దుకాణం నడుపుకొనే రూపావత్ శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చేనేత సహకార సంఘం అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేశం

## చేనేత కార్మికులకు అండగా ఉంటా

**-గజ్వేల్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు రాజేశం**

**గజ్వేల్ టౌన్, జూలై 11 (ప్రభాతవార్త):** పేద పద్మశాలీలు, చేనేత కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తామని గజ్వేల్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం స్పష్టం చేశారు. శనివారం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం, ప్రభుత్వం పథకాలను చిత్తశుద్ధితో వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా చేనేత మిత్ర, నేతన్న భరోసా, నేతన్న పొదుపు పథకాలతో పాటు భీమా వర్తింపజేస్తూ ఆర్థికంగా ఆదుకోనున్నట్లు చెప్పారు. అంతకుముందు ఎన్నికల అధికారి గౌతమ్ కుమార్ గెలుపొందిన వారికి ధృవీకరణ పత్రాలు అందజేయడంతో పాటు నూతన కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సంఘ ఉపాధ్యక్షులు వలందాస్ సత్యనారాయణ, కార్యదర్శి ఎలగందుల రామచంద్రం, డైరెక్టర్లు జిల్లా భాగ్యలక్ష్మి, అమృతమ్మ, దొంతుల ప్రసాద్, పద్మశాలి సంఘం బాధ్యులు బింగి పురుషోత్తం, గాడిపల్లి అనూప్, రాజారాం, నేత నాగరాజు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రవర్ణాల పాలనకు చరమగీతం పాడాలి

**-టిఆర్‌పి జిల్లా అధ్యక్షులు తుప్పతి బిక్షపతి**



మాట్లాడుతున్న బిక్షపతి

**గజ్వేల్ టౌన్, జూలై 11 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో అగ్రవర్ణాల ఆధిపత్య పాలన కొనసాగుతుందని, ఇక ఆ పరిస్థితికి ముగింపు పలికి బిసిలు రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు తుప్పతి బిక్షపతి పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో ఈనెల 5న భువనగిరిలో జరిగిన మహాసభ విజయవంతం కావడం బిసిల చైతన్యానికి నిదర్శనమని అన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన ప్రతికార్యకర్తకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా, మండల, యువజన, రైతు విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తోటపల్లి రిజర్వాయర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు చేప పిల్లలు మృతి : బిఆర్ఎస్



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**బెజ్జంకి, జూలై 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తోటపల్లి రిజర్వాయర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు కలవడం వల్ల చేప పిల్లలు మృతి చెందుతున్నాయని బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, వ్యవసాయానికి, మత్స్యకారుల జీవనాధారానికి ఎంతో కీలకమైన తోటపల్లి రిజర్వాయర్‌ను కాలుష్యానికి గురిచేయడం సరికాదన్నారు. కలుషితమైన నీటిని పంటలకు ఉపయోగించడం వల్ల భూముల సారవంతం తగ్గే ప్రమాదం ఉందని పశువుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి రిజర్వాయర్‌లోకి వ్యర్థ జలాలు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, మత్స్యకారులకు జరిగిన నష్టాన్ని అంచనావేసి తగిన పరిహారం అందించాలన్నారు. ప్రజా సమస్యలపై నిరసనగా బెజ్జంకి తహశీల్దార్ కార్యాయలం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్, నాయకులు లింగాల లక్ష్మణ్, ఉప సర్పంచ్ దుమాల మహేష్, వంగల నరేష్, వార్డు సభ్యులు తిప్పరపు మహేష్, పొట్లపెల్లి శివ, రామంచ పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం : మల్లికార్జున్



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

**హుస్నాబాద్ రూరల్, జూలై 11, ప్రభాతవార్త :** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ సూచించారు. శనివారం పట్టణంలోని వివిధ హెల్ప్ డెస్క్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీచేసి ఏర్పాట్లు, ఎన్యుమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌ల వద్దకు వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడిన కమిషనర్ ఎన్యుమరేషన్‌పత్రాలపై వారు అడిగిన సందేహాలకు అక్కడికక్కడే సమాధానాలు ఇచ్చి పూర్తి అవగాహన కల్పించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సూపర్వైజర్లు, వార్డు ఆఫీసర్లు, బీఎల్వోలు తప్పనిసరిగా విధులకు హాజరై బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయడమే లక్ష్యమని కమిషనర్ మల్లికార్జున్ పేర్కొన్నారు.

### రాజేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**హుస్నాబాద్ రూరల్, జూలై 11, ప్రభాతవార్త :** పొట్లపల్లి గ్రామంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీస్వయంభూ రాజేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతా పూజ, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, చండీ హోమం, రుద్ర హవనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.కిషన్‌రావు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# గజ్వేల్ అభివృద్ధిపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి

**మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**



సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడుతున్న తూంకుంట నర్సా రెడ్డి

**వర్గల్, జూలై 11(ప్రభాతవార్త):** గజ్వేల్ అభివృద్ధిపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తుండగా, ప్రజాపాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యపడుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరితో కలిసి సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు వెచ్చిస్తుందని గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ గజ్వేల్‌కు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సిఎం రేవంత్‌రెడ్డి కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వపాఠశాలలు, ఇంటర్మీడియట్‌లో మధ్యాహ్న భోజనంతో పాటు పిల్లలకు ఉదయం అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకోగా, పేద విద్యార్థులకు మంచి చదువు, నాణ్యమైన భోజనం అందించి భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుండగా, గజ్వేల్‌కు రెండు విడతల్లో 6వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రూ.2 లక్షల పంట రుణమాఫీ చేయగా, పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయడంతో పాటు రైతు భరోసా పథకం కింద రూ.12వేలు ఖాతాలలో జమచేసినట్లు స్పష్టం చేశారు. ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుండగా, నిరుద్యోగుల కోసం ప్రతి నియోజకవర్గానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తూ విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి నిరుపేద కుటుంబాలకు మేలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపిపి మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, నేతలు చెన్నయ్య, గోరేమియా, గోపాల్ రెడ్డి, కుమార్, మహేందర్‌గౌడ్, అంజిరెడ్డి, పొన్నాల నర్సా రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యం

**బిజెపి జిల్లా అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్**

**సిద్దిపేట అర్బన్, జూలై 11, ప్రభాతవార్త :** అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ జిల్లా బిజెపి కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 21 మంది సభ్యులతో జిల్లా కమిటీని రూపొందించినట్లు వెల్లడించారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కమిటీ కృషి చేస్తుందన్నారు. కొత్త కమిటీలో ఆరుగురు జిల్లా ఉపాధ్యక్షులతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కోశాధికారి, మీడియా కన్వీనర్, ఐటిసెల్ కన్వీనర్లను నియమించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించి బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ జిల్లాలో బిజెపిని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి పని చేస్తామన్నారు.

**నూతన కమిటీ...**

బిజెపి జిల్లా నూతన కమిటీ వివరాలను జిల్లా అధ్యక్షులు శంకర్ ముదిరాజ్ వెల్లడించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా తేకులపల్లి బాల్‌రెడ్డి, కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి, తోడుపునూరి వెంకటేశం, కొత్తపల్లి వేణుగోపాల్, మాచర్ల కుమారస్వామి గౌడ్, కట్టా భాగ్యలక్ష్మీ, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నాతి మల్లేష్‌ముదిరాజ్, ఖమ్మం వెంకటేశం, బూరెడ్డిగారి విభీషణ్‌రెడ్డిలను నియమించినట్లు వివరించారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు బాసంగారి వెంకట్, నాయకులు తుంగ కనకయ్య, వీరారెడ్డి, శ్రావణ్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

**చిన్నకోడూరు, జూలై 11,ప్రభాతవార్త :** మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ శనివారం చిన్నకోడూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జాతిపిత గాంధీజి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సందబోయిన పరశురాం యాదవ్, ఉడుల జయంత్, బత్తిని గణేష్‌గౌడ్, మేడిపల్లి శ్రీకాంత్, పొన్నాల రాజేష్, కొమ్ము ప్రశాంత్, నక్క రాజు, స్వామి, అంతగిరి చంద్రశేఖర్, మహంకాళి యాదగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఘన సత్కారం

**సిద్దిపేట రూరల్. జూలై 11, ప్రభాతవార్త :** అసెంబ్లీ దళిత సంక్షేమ కమిటీ చైర్మన్‌గా నియమితులైన చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యంను శనివారం హైదారాబాద్‌లో టిపిసిసి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మెరుగు రాజు, డిసిసి ప్రధాన కార్యదర్శి ఎం.డి.షాబుద్దీన్, ఎన్ఎస్‌యుఐ నాయకులు జి.అనిల్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సత్కారించారు. దళితుల పక్షాన రాష్ట్రంలో ఎక్కడ ఏ సమస్య ఉన్న ప్రభుత్వం తరపున అసెంబ్లీలో మాట్లాడుతానని నిరంతరం దళితుల అభ్యున్నతికి పాటుపడుతానని ఎమ్మెల్యే డాక్టర్ సత్యం తెలిపినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు.

## గుమ్మడిదలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**గుమ్మడిదల, జూలై 11 (ప్రభాతవార్త):** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో మండలంలోని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడిదల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న పాపనికుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి పాల్గొని ప్రజలకు జనాభా, కుటుంబ ఆరోగ్యం, సంతానోత్పత్తి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి యువ జనాభా అత్యంత కీలకమని అన్నారు. ప్రస్తుతం ఉన్నత విద్య, ఉద్యోగాలు, మానసిక ఒత్తిడి, ఆలస్య వివాహాలు వంటి కారణాలతో దంపతుల్లో సంతానోత్పత్తి శాతం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. అలాగే మత్తు పదార్థాల వినియోగం, జీవనశైలిలో మార్పులు, మహిళల్లో పెరుగుతున్న పీసీఓడీ వంటి ఆరోగ్య సమస్యలు సంతాన సామర్థ్యంపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు. భారతదేశం 140 కోట్లకు పైగా జనాభా కలిగిన దేశమైనప్పటికీ, భవిష్యత్ తరాలకు సమర్థమైన యువశక్తి అవసరమని, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని కనీసం ఇద్దరు పిల్లలను కనేలా ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తి మహేష్, సురభికుమార్‌గౌడ్, నాయకులు, మల్లారెడ్డి హాస్పిటల్ వైద్య విద్యార్థులు డా. నోయెల్, హెచ్ఈఓ శ్రీనివాస్, సూపర్వైజర్లు శ్రీలక్ష్మి ..మ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లు, నూతన విత్తన చట్టాలు రద్దు చేయాలి

**రాయపోల్, జూలై 11 (ప్రభాతవార్త):** కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రగ్గు చేయాలని, తెలంగాణలో వాటిని అమలు చేయవద్దని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం రాయపోల్ మండలకేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లు, విబిజి రామ్‌జీ పథకం, నూతన విత్తన చట్టాలు రైతులు, కార్మికులకు నష్టం కలిగిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేరడంతో పేదల ముఖాల్లో సంతోషం

**గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి**

**కొండపాక, జూలై 11, ప్రభాతవార్త :** సొంతిటికల నెరవేరడంతో పేదల ముఖాల్లో సంతోషం కనబడుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంటా నర్సా రెడ్డి అన్నారు. శనివారం కొండపాక మండలం వెలికటనగ్రామంలో ఇండ్ల గృహప్రవేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గన్ని గుడిసెలులేని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నమన్నారు. మొదటి విడతలో గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాదన్యత ఇచ్చామని తెలిపారు. రెండవ విడతలో సైతం అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ పర్షరాములు, సర్పంచ్ మానస, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మంచాల కనకరాములు, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ బైరీ ప్రవీణ్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్‌మెంబర్ వాసరి లింగరావు, సర్పంచ్ గంగాధర్, నాయకులు పెరుగు తిరుపతి, రాజు, బుద్ది రమేష్, సిద్దులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వాటర్‌ఫిల్టర్ అందజేత

**కొండపాక, జూలై 11, ప్రభాతవార్త :** విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే శ్రద్ధగా చదువుతారని తకడమడ్ల శ్రీనివాస్ అన్నారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలకు తడకమడ్ల లక్ష్మయ్య జ్ఞాపకార్థం వాటర్ ఫిల్టర్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన సేవా స్ఫూర్తిని చాటుకున్నందుకు, విద్యార్థుల అరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చేసిన ఈ సహాయనికి కృతజ్ఞతగా పాఠశాల హెచ్ఎం బండి అశోక్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌లు అభినందించారు.

## హుగ్గెల్లిలో ఎస్ఐఆర్ పై హెల్ప్ డెస్క్ ప్రారంభం

**జహీరాబాద్, జూలై 11 ప్రభాతవార్త :** ప్రత్యేక సమగ్ర సర్వే సర్‌లో భాగంగా గ్రామ ప్రజలకు సర్‌పైన అవగాహన కల్పించేందుకు ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను శనివారం గ్రామ సర్పంచి పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఎస్ఐఆర్ ఫారాలను పూరించే విధానంపై ప్రజలకు ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత దరఖాస్తులను ఎటువంటి తప్పులు లేకుండా ఎలా పూర్తి చేయాలనే దానిపై ఈ సందర్భంగా గ్రామస్థులకు స్పష్టమైన సూచనలు మరియు సలహాలు అందించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ళ నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫారాల పూరింపులో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సవివరంగా వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా, దరఖాస్తులను సరైన పద్ధతిలో నింపాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ యం.పి.పి రాములు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహులు, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కుమ్మరి రాజు, ఇమామ్ పటేల్, స్థానిక నాయకులు మునిందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బాలరాజు, నరేష్, రాజశేఖర్, సిద్దారెడ్డి, మాణయ్య, పాండు, ముస్తఫా, ఇంద్రా రెడ్డి, అశోక్, రాజు మరియు పంచాయతీ కార్యదర్శీ, ఆర్ఐ, బిఎల్వోల, బిఎల్ఏలు గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం

**సదాశివపేట జూలై 11 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులను విడుదల చేస్తూ, కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతులకు ఇచ్చిన హామీని సిఎం రేవంత రెడ్డి నిలబెట్టుకున్నారని అన్నారు. రైతుల ఆర్థిక భరోసా కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వ్యవసాయ రంగానికి ఎంతో ఊతమిస్తాయని అన్నారు. కార్యక్రమంలో పృథ్వీరాజ్, వెంకట్‌రావు, రాంరెడ్డి, నారాయణ్‌రెడ్డి, సంగమేశ్వర్, జలీల్, కుమార్, ఖుర్షీద్, అమృత్‌రావు, గోపాల్, ఏసయ్య, పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాలం తెచ్చిన కరువు కాదు
# కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువు

**మాజీ మంత్రి హరీష్‌రావు**

**నంగునూర్, జూలై 11, ప్రభాతవార్త :** ప్రస్తుతం రాష్ట్రంలోఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరవుఅని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు అన్నారు. నంగునూర్ మండలం తిమ్మాయిపల్లిలో శనివారం నిర్వహించిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో పాల్గొన్ని అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. గోదావరి నదిలో కావాల్సినంత నీరు ఉన్నప్పటికీ కెసిఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదన్నారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని మోటార్లు ఆన్‌చేస్తే రంగనాయకసాగర్ నిండి నియోజకవర్గానికి సాగునీరు అందుతుందన్నారు. కాళేశ్వరం జలాలతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతుందన్నారు. కాళేశ్వరం వలన ఒక్క ఎకరం కూడా పండలే అన్న రేవంత్‌రెడ్డి తిమ్మాయిపల్లికి వచ్చి చూడాలన్నారు. కాళేశ్వరం నీళ్లు వచ్చినయా రాలేదా ప్రజలే సాక్ష్యమన్నారు. అయిల్‌ఫాం సాగుపై రైతులు దృష్టిసారించాలన్నారు. రేవంత్‌రెడ్డి మూర్ఖపు పట్టుదలను వీడి వెంటనే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేసి ఈ కరువు కాలంలో గోదావరి జలాలను పారించేలా ఆ పెద్దమ్మ తల్లి ఆయనకు సద్బుద్ధి ప్రసాదించాలని అమ్మవారికి వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న హరీష్‌రావు

**ప్రజల ఆరోగ్యమే నిజమైన అభివృద్ధి...**

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే నిజమైన అభివృద్ధి అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులకు ఎల్‌విప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచితంగా కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి ప్రజల కంటికి రక్షణ కవచమని ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి స్కిల్ ఎక్స్‌పో అండ్ గైడెన్స్ ఫెస్టివల్‌కు మెరిడియన్ హైస్కూల్ ఎంపిక

**సిద్దిపేట అర్బన్, జూలై 11, ప్రభాతవార్త :** జాతీయస్థాయి స్కిల్ ఎక్స్‌పో అండ్ గ్రైడెన్స్ ఫెస్టివల్ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి జిల్లా కేంద్రంలోని మెరిడియన్ హైస్కూల్ ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, రాజావెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ వి.రాజేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. దేశ వ్యాప్తంగా కేవలం 31 జాతీయ స్థాయి కేంద్రాలను ఎంపికచేయగా తెలంగాణ నుంచి మెరిడియన్ హైస్కూల్ ఎంపికైందన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ స్కిల్ ఎక్స్‌పో అండ్ గైడెన్స్ ఫెస్టివల్ రాష్ట్రంలో ఏకైక వేదికగా మెరిడియన్ హైస్కూల్‌లో నిర్వహించడం సిద్దిపేట ప్రాంతానికి రాష్ట్ర ప్రజలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులు, అవిష్కరణలు, సాంకేతిక నమూనాలు ప్రదర్శించబడుతాయని తెలిపారు.

**ఘనంగా గైడెన్స్ ఫెస్ట్**

కాగా భవిష్యత్ విద్యా, వృత్తి అవకాశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు మెరిడియన్ హైస్కూల్‌లో గైడెన్స్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు నిపుణులు విద్యార్థులకు ప్రేరణాత్మక, విజ్ఞానవంతమైన ప్రసంగాలు అందించారు. రిస్క్ గార్డ్ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్ ఓపెక్ లిమిటెడ్ హైదారాబాద్ వ్యవస్థాపకులు, సీఈఓ అనుముల ప్రసాద్ ఏఐ యుగంలో పిల్లలకు సైబర్ హైజీన్ అండ్ కంట్రోల్స్ అనే అంశంపై వివరించారు. లైఫాలజీ ఫౌండేషన్ తిరువనంతపురం ప్రాంతీయ డైరెక్టర్ సాయి విష్ణుష్ అర్థవంతమైన కెరీర్ అనే అంశంపై వివరించారు. ఎంసీఎంఎల్ ప్రాజెక్ట్స్ హైదారాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్ నారాయణ పాఠశాల అనంతరం కెరీర్ మార్గాలు అనే అంశంపై వివరించారు.

## ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**తొగుట, జూలై 11, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శనివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పండితుల జయరామశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ట నిర్వహించారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ నవీన్, క్యాస రాజకుమార్ దంపతులు, సర్పంచ్ శోభకొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలరాజు, జి.శ్రీకాంత్, డాక్టర్ నర్సింలు, బాలమల్లు, రామస్వామి, ప్రభాకర్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ ఆంజనేయస్వామి కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆంజ నేయస్వామి విగ్రహ ప్రతిష్టతో జై శ్రీరామ్..జై హనుమాన్ నామస్మరణతో మార్మోగింది.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**అక్కన్నపేట, జూలై 11, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం చౌదు తండాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొబ్బరికాయకొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో సీసీ రోడ్ల నిర్మాణం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం నిధులను సద్వినియోగం చేస్తూ గ్రామాల్లో అంతర్గత రహదారులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్‌నాయక్, ఉపసర్పంచ్ గుగులోత్ అర్జున్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, సక్ర సంతోష్, వార్డు సభ్యుడు దత్తాత్రేయ, సంతోష్, తిరుపతి రాజు, గ్రామ పెద్దలు లింగ నాయక్, బిక్య నాయక్, శంకర్ నాయక్‌తో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సముద్రాలలో వర్షాల కోసం ప్రత్యేక పూజలు

**కోహెడ, జూలై 11, ప్రభాతవార్త :** మండలంలోని సముద్రాల గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు నీళ్ల పోసి జలాభిషేకం చేసి, పెరుమాళ్ల ఆంజనేయస్వామి ఆలయం ముందు సంప్రదాయబద్ధంగా వరదు పాసం పోసి వర్షాలు కురవాలని ప్రార్థించారు. కొంతకాలంగా ఆశించినస్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు కలిసి పూజలు నిర్వహించి, పంటలు బాగా పండేలా సమృద్ధిగా వర్షాలు కురవాలని దేవుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

## కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా వైస్ చైర్మన్‌గా కొత్తూరి నరహరి

సిద్దిపేట రూరల్, జూలై 11, ప్రభాతవార్త : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ డిపార్ట్మెంట్ సిద్దిపేట జిల్లా వైస్ చైర్మన్‌గా సిద్దిపేట రూరల్ మండలం తొర్నల్ గ్రామానికి చెందిన కొత్తూరి నరహరిని నియమిస్తూ ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్ ఆదేశాలు జారీచేశారు. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతోకలిసి రాజేంద్రపాల్ గౌతమ్ సమావేశమయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాలను ప్రజల్లో ఎలా సమర్థవంతంగా తిప్పికొట్టాలనే అంశాలపై వారు విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. అనంతరం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్‌గా కొత్తూరి నరహరిని నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్లు కొమ్ము విజయ్‌కుమార్, దుర్గం శేఖర్, జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ తప్పెట శంకర్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటురుగా పేరు నమోదు చేసుకోవాలి

**బెజ్జంకి, జూలై 11, ప్రభాతవార్త :** మండలంలోని ప్రతి ఒక్కరూ ఓటు ఎన్యూమరేషన్ చేయించుకోవాలని లేదంటే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ అన్నారు. మండల పరిధిలోని రేగులపల్లె గ్రామంలో జరుగుతున్న సర్ కార్యక్రమంలో భాగంగా బిఎల్ఓలు చేస్తున్న ఓటర్ ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్, సర్పంచ్ జంగిలి లక్ష్మి తిరుపతి, పార్టీ నాయకులు జీలం లింగం, జెల్ల ప్రభాకర్, రావుల నర్సయ్య, తిరుపతిరెడ్డి, ప్రసాద్, సంపత్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి : తహసీల్దార్

**బెజ్జంకి, జూలై 11, ప్రభాతవార్త :** సర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తహశీల్దార్ శ్రీకాంత్ సూచించారు. బెజ్జంకి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించి మాట్లాడారు. సర్ దరఖాస్తు ఫారాలను బిఎల్ఓలకు అందజేయని వారు వెంటనే అందజేయాలని లేనియెడల ప్రజలు తమ ఓటును కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓలకు అందించాలన్నారు. 2002లో ఓటర్లుగా నమోదు అయి లేకుండా ఉన్నటువంటి ఓటర్ల నమోదు ప్రక్రియ పై సూపర్‌వైజర్ రమేష్, సంబంధిత బిఎల్ఓకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెల్లం శ్రీధర్ పెద్దన్న, ఉప సర్పంచ్ దుమాల మహేష్, వార్డు సభ్యులు మహేష్, నర్సింగరావు, బిఎల్ఓలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక లాభాలు

**సర్పంచ్ అకుల భద్రప్ప**

**కొండపాక, జూలై 11, ప్రభాతవార్త :** ఆయిల్ పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా అధిక ఆదాయం లభిస్తుందని దానికి ప్రభుత్వం అందించే ప్రోత్సకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అకుల భద్రప్ప రైతులకు సూచించారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారంలో రైతు సోమాలేటి వరలక్ష్మి మూడెకరాల వ్యవసాయ క్షేత్రంలో అయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అయన మండల వ్యవసాయ అధికారి గోవందరాజులుతో కలిసి మాట్లాడుతూ రైతులు తక్కువ సమయంలో అధిక దిగుబడులను ఇచ్చే పంటలను సాగు చేసి అధిక లాభాలను పొందాలని కోరారు. పంటల వైవిధ్వీకరణతోపాటు అధిక అదాయం పొందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తునన జాతీయ తినదగిన నూనెల మిషన్ అయిల్ పామ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మొక్కలు, సాంకేతిక సలహాలు, వివిధ ప్రోత్సహకాలను అందిస్తున్నందున అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఈఓ శ్రీహరి, అయిల్ పేడ్ ఫీల్డ్ ఆఫీసర్ రాజు, సుధాకర్, డ్రిఫ్ అధికారి శ్రీనివాస్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.


కలశాలతో ఊరేగింపుగా ఆలయనికి చేరుకుంటున్న గ్రామస్థులు

## వర్షాల కోసం గ్రామ దేవతలకు జాలాభిషేకం

**మనూర్, జూలై 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పుల్‌కుర్తి గ్రామంలో గ్రామస్థులు వరుణుడి కరుణ కోసం శనివారం గ్రామ దేవతలకు జలాభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు కలశాలతో గ్రామ దేవతల ఆలయాల వరకు వరుణదేవుడి నామస్మరణతో భజన కీర్తనలు చేస్తూ ఊరేగింపుగా చేరుకుని జలాభిషేకం చేసి పూజలు నిర్వహించి సకాలంలో వర్షాలు కురిపించి ఆదుకోవాలని వేడుకున్నారు. ఆలయాల్లో పూజా కార్యక్రమాల అనంతరం తీర్ధ ప్రసాదాల వితరణ నిరర్వహించారు.

## గచ్చు మత్తడిలో పూడిక తీత.. గ్రామస్థుల హర్షం


గచ్చు మత్తడిలో పూడికతీత పనులు నిర్వహిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, జూలై 11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గచ్చు మత్తడి కాలువకు దశాబ్ద కాలం తర్వాత మోక్షం లభించింది. గ్రామ శివారులోని సాకీ చెరువు నుంచి శీలం చెరువు వరకు ఉన్న గచ్చు మత్తడిలో పదేళ్లుగా మొలచిఉన్న పిచ్చిమొక్కలను, మట్టిని తొలగించకపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరుగలేదు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు పాటిల్ వినతి మేరకు ఇరిగేషన్ అధికారులు శనివారం జేసిబి సహాయంతో కాలువలో పూడుకుపోయిన మట్టిని తొలగించడంతోపాటు పిచ్చిమొక్కలను తొలగించారు. కాలువను ఉపయోగంలోకి తెస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ధర్మారం గ్రామ నాయకులు

**రామాయంపేట, జూలై 11, ప్రభాతవార్త :** ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సుతార్పల్లి, ధర్మారం, వెంకటాపూర్, అక్కన్నపేట గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన సుమారు రూ.9లక్షల విలువైన చెక్కులను మహేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మానెగల్ల రామకిష్టయ్య, ధర్మారం సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**మహేందర్‌రెడ్డికి సన్మానం**

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి పదవి చేపట్టాక మొదటిసారి గ్రామానికి వచ్చిన సందర్బంగా ప్రగతి ధర్మారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మసాయిపేట మల్లేశం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్రామ సీనియర్ నాయకులు ఉడుత రాజేశం, మాజీ ఎంపిటీసీ ముస్కుల సిద్దరాంరెడ్డి, పాదుల్లా, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలను తహసీల్దార్ తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శివప్రసాద్

**చిలిపిచెడ్, జూలై 11 ప్రభాతవార్త:** మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తహసీల్దార్ శివప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, ఆహార పదార్థాలను, నిత్యావసర సరుకులను పరిశీలించారు. విద్యార్థినుల విద్యా ప్రమాణాలు, బోధన విధానం, హాస్టల్ నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తహసీల్దార్ శివప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పోషకాహారం అందేలా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తనిఖీల్లో ఆర్ఐ శ్రీహరి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ బిఎల్ఓలకు సహకరించాలి

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**శివ్వంపేట, జూలై 11 ప్రభాతవార్త :** సర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలకు ప్రతీ ఒక్కరు సహకరించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం శివ్వంపేట మండలం గోమారం గ్రామంలోని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తన వివరాలతో పాటు కుటుంబసభ్యుల వివరాలను బిఎల్ఓలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరును బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారనే అంశాలపై బీఎల్ఓను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమాన్ని ప్రజలందరు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతీఒక్కరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్ తదితరులు ఉన్నారు.


వివరాలు చెబుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# జేఎన్టీయూలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**చౌటకూరు, జూలై 11, ప్రభాతవార్త:** సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని వైద్య ఆరోగ్య, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాలలకు తోషిబా పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్‌నిధుల కింద అందచేసిన బస్సులను శనివారం మంత్రి ప్రారంభించారు. బస్సులను ప్రారంభించిన మంత్రి బస్సులో ప్రయాణించి ఫార్మసీ కళాశాలకు చేరుకుని స్మార్ట్ కంప్యూటింట్ లేబొరేటరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ సుల్తాన్‌పూర్ క్యాంపస్ అతి తక్కువ కాలంలోనే అభివృద్ధి సాధించిందని ప్రశంసించారు. సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగాఉంటుందని భరోసా కల్పించారు. ఆధునిక ప్రయోగశాలలు, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలకు నిరంతర సహకారం అందిస్తామన్నారు. బస్సు సౌకర్యం, ఆధునిక ప్రయోగశాలలు కళాశాలను మరో మైలురాయికి చేరుస్తాయన్నారు. నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమ-విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్, సిముఖ్యులేషన్ ల్యాబ్ ద్వారా సెమీ కండక్టర్ టెక్నాలజీ, చిప్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్ లాంటి ఆధునిక రంగాలలో విద్యార్థులకు ప్రయోజిత శిక్షణ అందించబడుతుందన్నారు. స్మార్ట్ కంప్యూటింగ్ ల్యాబ్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఐఓటి, సైబర్ సెక్యూరిటీ లాంటి ఆధునిక సాంకేతిక రంగాలలో శిక్షణ, పరిశోధన, ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించబడుతాయన్నారు. జెఎన్టీయూలో నూతనంగా క్లాక్ టవర్‌ను నిర్మించనున్నామని, అందుకు అవసరమైన స్థలాన్ని మంత్రి పరిశీలించి వెంటనే ప్రతిపాదనలు, క్లాక్ టవర్ నమూనాలను తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. క్లాక్ టవర్ కళాశాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. క్లాక్ టవర్ సమయపాలన, క్రమశిక్షణ, విద్యా ప్రగతి, ఉన్నత విలువలకు ప్రతీకగా నిలిచి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే చిహ్నంగా నిలువనున్నందన్నారు. కళాశాలకు కేటాయించిన బస్సులోనే సిబ్బంది, విద్యార్థులతో కలసి కళాశాలలో మంత్రి ప్రయాణించి అందరిని ఉత్సాహపరిచారు. జేఎన్టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి కిషన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ అందిస్తునన సహకం ఎనలేనిదని కొనియాడారు.


విద్యార్థినితో కలిసి ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

తోషిబా పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల కింద రెండు బస్సుల మంజూర య్యేలా చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం-పరిశ్రమల-విద్యా సంస్థల భాగస్వామ్యంతోనే ప్రపంచస్థాయి సాంకేతిక విద్యను అందించగలమని వైస్ చాన్సలర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ప్రిన్సిపాల్ ఎస్ విశ్వనాథరాజు, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతారెడ్డి, రెక్టార్ దమోదరం, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఆయా విభాగాధిపతులు విద్యావతి, రజనీష్, శైలజ, శ్వేత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

**గుమ్మడిదల, జూలై 11 (ప్రభాతవార్త):** శుక్రవా రం గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ చిన్న పాపని కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలోని 22 వార్డులకు ఒక్కోవార్డుకు రూ.40 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానాలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం-2019 ప్రకారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి అవసరమైన కోరం పూర్తయినతర్వాతే సమావేశాన్ని కొనసాగించి తీర్మానాలను ఆమోదించవచ్చు. చట్టం లోని సెక్షన్-40 ప్రకారం కోరం ఉన్నప్పుడే సమా వేశం చట్టబద్ధంగా కొనసాగుతుంది. అలాగే సెక్షన్- 59(2) ప్రకారం సమావేశానికి హాజరైన సభ్యుల సాధారణ మెజారిటీతో తీర్మానాలు, అభివృద్ధి పను లకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం ఇవ్వ వచ్చు. మొత్తం 22 మంది కౌన్సిలర్లు ఉన్న గుమ్మ డిదల మున్సిపాలిటీలో మూడింట ఒక వంతు (1/3) సభ్యులు, అంటే కనీసం 8 మంది హాజరైతే కోరం పూర్తయినట్లుగా పరిగణిస్తారు. చైర్మన్ తెలి పిన వివరాల ప్రకారం, కోరం పూర్తికావడంతో 22 వార్డులకు అభివృద్ధి నిధుల కేటాయింపుకు సమావేశం ఆమోదం తెలిపింది. సమావేశానికి వైస్ చైర్మన్ సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు సురభికుమార్‌గౌడ్, కత్తుల రమేష్, సరెడ్డిగారి పద్మ, పొన్నాల ప్రమీల, షేక్ గౌసియా, తుపాకుల రాధిక, కోఆప్షన్ మెంబర్లు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, మహమ్మద్ ఫయాజ్, తహాసీల్దార్ పరమేశం, వ్యవసాయ అధికారి శ్రీని వాస్, మండల వైద్యాధికారి డా. మధుకర్, ఎంపి హెచ్ఓ శ్రీనివాస్, ఎంఇవో పొలినారెడ్డి, మున్సిపల్ అధికారులు రాములు పాల్గొన్నారు.

## జల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

**నర్సాపూర్, జూలై 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్ద చింతకుంట శివారులో నర్సాపూర్ మెదక్ ప్రధాన రహదారిపైగల జలహనుమాన్ ఆలయంలో శనివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ కాటం బిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి రాధాకృష్ణ శర్మ వేదమంత్రాల మధ్యన శ్రీ జలాంజనేయ స్వామికి అభిషేకం, పంచామృతాభిషేకం, సింధూర లేపనం వంటి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నర్సాపూర్ గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపల్ బస్వరాజ్ కుటుంబ సభ్యులచే ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలోని భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. అనంతరం భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ అధ్యాపకులు సాయికుమార్, గ్రామ పెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆత్మ కమిటీ చైర్మన్

**గుమ్మడిదల, జూలై 11 ప్రభాతవార్త :** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తూ, వాటి నింపే విధానంపై అవగాహన కల్పిస్తున్న తీరును ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతో కీలకమని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం నిర్ణీత గడువులోపు ఫారాలను సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ వో శోభ, బీఎల్ ఏలు విజయ్ కుమార్, రమేష్, గ్రామస్తులు చాకలి చంద్రయ్య, ఆగం వెంకటస్వామి, కుమ్మరి వీరస్వామి, ఆగం మల్లేశం, గడ్డమీది వీరమని, పాలాటి అనసూయ, కుమ్మరి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్‌లో ఆర్డీవో...**

**జహీరాబాద్ జూలై 11 ప్రభాతవార్త :** పట్టణంలోని 27వ వార్డులోగల 174వ పోలింగ్ స్టేషన్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆర్డీవో దేవూజా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో చేపడుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను నిబంధనల మేరకు స్వీకరించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్, బీఎల్‌వో వసియా ప్రవీణ్, ఆర్‌పీ లక్ష్మి ్క, బీఎల్ఏలు నరేష్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా పత్రాలు సమర్పించాలి: నర్సింగరావు

**గుమ్మడిదల, జూలై 11 (ప్రభాతవార్త):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) కొనసాగుతోంది. ఈ సందర్భంగా హెల్ప్‌డెస్క్‌లో వార్డు అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌కు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, పటాన్‌చెరు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడమటి మహిపాల్‌రెడ్డి పాల్గొని ఎస్ఐఆర్ పత్రాలను సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను పరిశీలించుకొని అవసరమైన పత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. అధికారులు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఎలాంటి సందేహాలున్నా అక్కడే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 14న సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి

### ఐటీయూసీ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు బోయిని ప్రసాద్

**గుమ్మడిదల, జూలై 11 (ప్రభాతవార్త):** ఈ నెల 14వ తేదీ (మంగళవారం) నిర్వహించనున్న 'సంగారెడ్డి చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయిని ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్లు, స్వీపర్ల సమస్యలను ఏ ప్రభుత్వం పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో అటెండర్లు లేకపోవడం, స్కావెంజర్లు లేకపోవడంతో కార్మికులు బానిస ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికులకు హామీలు ఇచ్చే ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తున్నాయని అన్నారు.

## సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్

**నర్సాపూర్, జూలై 11. ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ సూచించారు. శనివారం జానకంపేట్, మహమ్మదాబాద్‌గ్రామాలతోపాటు తండాలను ఆయన పర్యటించి సర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ నమోదుపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్హులైన ప్రతి వారు ఓటు హక్కుగా భావించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్ గౌడ్ తో పాటు బిజెపి నాయకులు సంతోష్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో కొనసాగుతున్న సర్ సర్వే

**సిర్గాపూర్, జూలై 11, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు నల్లవాగు, పోచాపూర్, గోసాయిపల్లి, అంతర్గాం, ముబారక్‌పూర్ గ్రామాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రీయ కార్యక్రమం జోరుగా కొనసాగతోంది. ఈ కార్యక్రమంలో శంకర్‌పటేల్, విఠల్‌సాగర్, పండరిగౌడ్, సూర్యకాంత్ పటేల్, మహమ్మద్ అలీ, ఈరోల్, ధనరాజ్, గురపు నరేంద్ర, అన్న అంబన్న, నాగేష్, రాములు, కంగ్రి విఠల్(సర్పంచ్), దత్తు సాగర్ తదితరులు పాల్గొని తమ కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకున్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన డిప్యూటీ తహసీల్దార్

**న్యాల్‌కల్, జూలై 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మిర్జాపూర్(బి), గంగ్వార్, బసంత్‌పూర్, మామిడ్గి గ్రామాల్లో కొనసాగుతున్న సర్ ప్రక్రీయను శనివారం డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి పరిశీలించి బిఎల్ఓలకు, ఓటర్లకు పలు సూచనలు చేశారు. బిఎల్ఓలు అందచేసిన ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపి గడువులోగా బిఎల్ఓలకు అందచేయాలని ఓటర్లకు సూచించారు.

## ఎస్ఐఆర్ పత్రాలను పూర్తిచేసి అందజేయాలి

### మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్

**జహీరాబాద్, జూలై 11 (ప్రభాతవార్త):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ప్రతి ఓటరు బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పత్రాలను అందుకున్న ప్రతి ఓటరు ఎలాంటి ఆలస్యం చేయకుండా వాటిని పూర్తిగా, సరైన వివరాలతో నింపి తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారిలకు అందజేయాలని సూచించారు. ఇప్పటివరకు అందని వారు వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి ఫార్మ్స్ పొందాలని, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి నిర్ణీత గడువులోపు సమర్పించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండం నర్సింలు, మున్సిపల్ కౌన్సిలర్లు జహంగీర్, మహేష్, వకీల్ చౌహాన్, నిజాముద్దీన్, అక్రమ్, కోఆర్డినేటర్ గౌస్, కాంగ్రెస్ యూత్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫామ్స్ బిఎల్ఎలకు అందజేత

**సదాశివపేట, జూలై 11 (ప్రభాతవార్త) :** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తన అన్యూమరేషన్ ఫామ్‌ను పూర్తి చేసి సంబంధిత బిఎల్ఓలు అనురాధ, జయశ్రీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు ఎస్ ఐ ఆర్ ఫామ్‌ను పూర్తిగా నింపి సంబంధిత బి ఎల్ ఓ లకు అందజేసి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ర్యాకల్ వీరేశం పాల్గొన్నారు. మరోవైపు సదాశివపేట పట్టణం 8వ వార్డు హనుమాన్ నగర్ కాలనీలో కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ శివాజీ, బి ఎల్ ఓ అంగడిపేట సంగీత, ఆర్‌పీ లావణ్య, సూపర్వైజర్ శివాని ఆధ్వర్యంలో ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయం అందించి, పూర్తిచేసిన ఫారాలను వెంటనే సంబంధిత అధికారుల అందజేయాలని సూచించారు.

## అనంతారంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై తహసీల్దార్ పరిశీలన

**గుమ్మడిదల జూలై 11 ప్రభాతవార్త :** మండలంలోని అనంతారం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తహసీల్దార్ పరమేశం శనివారం పరిశీలించారు. గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన, ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, వివరాల నమోదు విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బిఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు భాస్కర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

**మనూర్, జూలై 11, ప్రభాతవార్త:** వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని ఎస్ఐ కోటేశ్వరరావు సూచించారు. శనివారం రాయిపల్లి, ఉపిరిక పల్లి గ్రామాల శివారులో వాహనాలను తనిఖీ చేశారు. వాహన చోదకులు వాహనపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్, పొల్యూషన్ లాంటి పత్రాలను అందుబాటులో ఉంచుకుని వాహనాలను నడపాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్‌ను, కారు చోదకులు సీటు బెల్టును ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని చెప్పారు.

## విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాల పంపిణీ

**కొల్చారం, జూలై 11(ప్రభాతవార్త):** మండల పరిధిలోని సీతారాం తండా ప్రభుత్వ పాఠశాలలో యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త, గీతం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, యూత్ ఫర్ సేవ ముఖ్య సలహాదారుడు ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్ కమల్ సురేష్, సర్పంచ్ కమ్లి మోహన్ సింగ్, ఉప సర్పంచ్ సునీత శివ, వార్డు సభ్యులు లలిత, మంగీలాల్, ఫుల్‌సింగ్, ఎం.అంజి, ఎన్. రాజు, ఎన్. రవి, కె. లక్ష్మణ్, ఎన్. హరియా, ఎం. సంతోష్, పి. రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి సంతోష్, యూత్ ఫర్ సేవ కార్యకర్తలు తేజ, విశాల్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**చౌటకూరు, జూలై 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొమ్మారెడ్డి గూడెం గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సంలో విద్యను అందుకునేందుకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మెట్రిన్ పి భవాని ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 3వ తరగతిలో 20 సీట్లు, 4వ తరగతిలో 20 సీట్లు, 5వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుచిత వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు అవసరమైన ధృవపత్రాలతో పాఠశాలకు చేరుకుని ధరఖాస్తులు అందచేయాలన్నారు. గిరిజన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెట్రిన్ భవాని సూచించారు.

## శివంపేట జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ లీడర్‌ల ఎన్నిక

**చౌటకూరు, జూలై 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేట గ్రామంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులలో స్కూల్ లీడర్‌లను శనివారం ప్రజాస్వామ్య పద్దతిలో ఎన్నుకున్నారు. విద్యార్థుల్లో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల విధానం, నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన ప్రవర్తనలాంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఎన్నికలు నిర్వహించి స్కూల్ లీడర్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా శ్రీభాను, ప్రిసైడింగ్ అధికారిగా హారికలు వ్యవహరించారు. బాలుర విభాగంలో చాపల అర్జున్, బాలికల విభాగంలో లక్ష్మీ ప్రణతిలు విజయం సాధించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు వీరేశం, శైలజ, సునీతబాయి, సునీత వేణి, నాగశ్రీ, మజీద్, రమేష్, సఫియా తదితరులు పాల్గొన్నారు.

## సిర్గాపూర్‌లో సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

**సిర్గాపూర్, జూలై 11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో వడ్డెర కాలనీలో సిసిరోడ్డు నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి భూమి పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దేవకతే మీరా బాయి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు పాటిల్, సర్పంచ్ కళ్యాణ్‌రావు పాటిల్, ఉప సర్పంచ్ భిక్షపతి యాదవ్, జమీల్, కామేష్, హుస్సేని, రాంచెందర్, దిలీప్ పటేల్, విఠల్‌రావు పాల్గొన్నారు.

**పోచంపల్లిలో...**

**సిర్గాపూర్, జూలై 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోచంపల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ రేణుకబాలరాజ్ ఉప సర్పంచ్ రమేష్‌తో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా సర్పంచ్ రేణుక బాలరాజ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయల ఏరాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉప సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాభివృద్దే లక్ష్యంగా పాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్, నాయకులు గొల్ల గోపాల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ అప్‌లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### మెదక్ ఆర్డీవో రమాదేవి

**రామాయంపేట, జూలై 11, ప్రభాతవార్త :** మెదక్ రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీఓ) రమాదేవి శనివారం రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 67, 68లను తహశీల్దార్ రజని కుమారితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏకైక డిజిటలైజేషన్ అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించి, పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోపు అప్‌లోడ్ పూర్తి చేయాలని సూచించిన ఆర్డీఓ, మరణాల నమోదుకు సంబంధించిన డబుల్ షిఫ్ట్ రిమార్కులను వెంటనే పరిశీలించి క్లియర్ చేయాలని, సంబంధిత రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి నమోదును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి, డేటాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆమె సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తనిఖీలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు, పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**జహీరాబాద్ జూలై 11 ప్రభాతవార్త :** పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి అని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ అన్నారు. నియోజకవర్గంలోని జహీరాబాద్, న్యాలకల్, కోహిర్, ఝరాసంఘం మండలాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ. 11,27,500 సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆయన సూచన మేరకు కోహిర్ మునిసిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు హుగ్గెల్లి రాములు సువర్ణమల్లన్నపాటిల్, పవన్‌రాథోడ్, పట్టణ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ముజాఫ్ఫార్ మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, పట్టణ మాజీ అధ్యక్షులు కండెం నర్సింలు, ఏయంసి వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు మహేష్ శిరీష రాణి, శ్రీకాంత్, సర్పంచ్ రాజ్‌కుమార్, చిన్నా హైదరాబాద్ ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు తదితరులు అందజేశారు.

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

**నారాయణఖేడ్, జూలై 11 ప్రభాతవార్త :** శనివారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎన్ఆర్ఎల్ఎమ్ పథకం ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. బాచేపల్లి గ్రామానికి చెందిన సాఫీజా బేగం, శ్రీరామ్ విజయ్‌కు మేకల పెంపకం యూనిట్లకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున, మొత్తం రూ. 4 లక్షల ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్ వంశీ ఏపీఎం, మోహన్ రెడ్డి బసవరాజ్, నగేష్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులుతదితర ముక్య నాయకులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**వెల్దుర్తి, జూలై 11, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గోన మైసమ్మ పరిసర ప్రాంతంలో శనివారం ముదిరాజ్ నాయకుల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రావణ్‌కుమార్, బిజెపి నాయకుడు శ్రీనివాస్ గౌడ్, ముదిరాజ్ నాయకులు, తోట నరసింహులు, కర్రె వెంకటేశం, కర్రె మైసయ్య, అరికెల సత్తయ్య, బోయిని రాములు, శంకర్, మైసయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### పార్టీ మండల అధ్యక్షుడు రాములుయాదవ్

**జహీరాబాద్ జూలై 11 ప్రభాతవార్త :** వచ్చే అసెంబ్లీ ఎన్నిక నాటికి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎంజీ రాములు యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని పూజలు బూచినెల్లి గ్రామ కూడలిలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఇండ్లు, పెన్షన్లు తదితర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో సర్ ప్రక్రియను పరిశీలించి సర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని బి ఎల్ ఓ సెక్రెటరీ లకు సూచించారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జున్ బుర్దిపాడ్ సర్పంచ్,కిషనరావుకుల్కర్ని, కిషన్ రాథోడ్, అలెగ్జాండర్, తుకారాం,లాజర్, మహేష్, పోచప్ప, నారాయణ, బోగిని లష్మిమానా, ప్రకాష్, చిన్న, తిమోతి, అశోక్, రియాజ్, రఫీ,రాంశేటీ మలేష్ తదితరులు పాల్గొన్నారు


బూచినెల్లిలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తుంది రాములు యాదవ్